PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 111 | విజయవాడ, బుధవారం 22 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 22 November 2023 | Rs

తేమ పేరుతో మిల్లర్ల దోపిడీ

- 75 కిలోల ధాన్యం బస్తాకు 8 నుంచి 9 కిలోల వరకు అదనపు తూకం
- ఆరబెట్టే అవకాశం లేక కోసిన వెంటనే విక్రయిస్తున్న రైతులు

3

ప్రపంచ బిలియర్డ్స్ ఛాంప్ పంకజ్

- ఫైనల్లో సౌరభ్
- కొఠారిపై గెలుపు
- రికార్డుస్థాయిలో 26వ సారి టైటిల్ కైవసం

8

అదే నిర్లక్ష్యం!

విభజన హామీలపై మారని కేంద్రం వైఖరి

హోంశాఖ సమావేశంలో విజ్ఞప్తులకే రాష్ట్రం పరిమితం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ, అమరావతి బ్యూరో

రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో ఏమాత్రం మార్పురాలేదు. విభజన హామీలపై మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలోనూ అదే ధోరణితో వ్యవహరించింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిర్వహించిన ఈ సమావేశంలోనైనా కేంద్రం సానుకూల ధోరణితో వ్యవహరిస్తుందని ఆశించిన వారికి మళ్లీ నిరాశే ఎదురైంది. గతంలో మాదిరే మరోసారి విజ్ఞప్తులు చేయడానికి, వినతిపత్రాలు అందచేయడానికి రాష్ట్ర అధికారులు పరిమితమయ్యారు. ఈ సమావేశ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సుదీర్ఘంగా సమీక్షను నిర్వహించి, వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేసిన సంగతి తెలిసిందే. వీటిని కూడా పూర్తిస్థాయిలో అధికారులు సమావేశంలో ప్రస్తావించలేకపోయారని సమాచారం. దీంతో కొన్ని అంశాలను రాతపూర్వకంగా అందచేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులు శ్రీలక్ష్మి, ప్రేమ చంద్రరెడ్డి, ఎస్ఎస్ రావత్, యువరాజు తదితరులు ఈ సమావేశం కోసమే న్యూఢిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే! అయినా, రాష్ట్రానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించే అవకాశాన్ని కూడా కేంద్ర హోంశాఖ అధికారులు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది. సిఎం సూచనల మేరకు ప్రత్యేక హోదా అంశాన్ని అధికారులు మరోసారి ప్రస్తావించారు. విభజన కారణంగా ఆర్థికంగా జరిగిన నష్టాన్ని ఇప్పటికే పూడ్చుకోలేకపోతున్నామని వివరించారు. పోలవరం నిధుల విడుదల జాప్యం లేకుండా వెంటనే విడుదల చేయాలనీ కోరినట్లు సమావేశానంతరం రాష్ట్ర అధికారులు తెలిపారు. హైస్పీడు రైళ్లు, రోడ్ల విస్తరణ అంశాలపైనా లిఖితపూర్వక వినతిని సమర్పించినట్లు వివరించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన పోర్టులు, కడప స్టీలు ప్లాంటు మంజూరుపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఎక్కువ అప్పులు కేటాయించడం వల్ల ఆర్థికంగా నష్టపోయామని కేంద్రానికి తెలిపారు. అలాగే కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంశాన్ని ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు విమానాశ్రయాల స్థాయిని పెంచాలని కోరామని పేర్కొన్నారు. కేంద్ర ప్రాజెక్టులకు సంబంధించిన అంశాల్లో రాష్ట్రం నిధులు వెచ్చిస్తోందని, వాటిని ఇవ్వాలని, లేదా కేంద్రమే నిధులు చెల్లించాలని కోరామని పేర్కొన్నారు. విభజన జరిగి పదేళ్లు పూర్తవ్వొస్తున్న నేపథ్యంలో తెలంగాణాలో పెండింగ్‌లో ఉన్న ఐదువేల కోట్ల రూపాయల బిల్లులు ఇప్పించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. దీనికి హోంశాఖ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు అధికారులు చెప్పారు. అయితే, ఈ సమావేశానికి తెలంగాణ అధికారులు హాజరు కాలేదు. వారిని ఆహ్వానించారా లేదా అన్న విషయమై స్పష్టత లేదు. దీంతో తెలంగాణతో ముడిపడి ఉన్న అంశాలపై ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరోసారి సమావేశం ఉంటుందని భావిస్తున్నారు.

ఇసిఐ ఆదేశాలను పాటించని అధికారులు

- ప్రత్యేక పరిశీలకులను నియమించండి
- గ్రామ సచివాలయ సిబ్బందిని బిఎల్ఒగా తొలగించాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి విజ్ఞప్తి

కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- ఐక్యపోరాటాలకు సన్నద్ధం కావాలి
- సిపిఐ 30గంటల నిరసన దీక్షలో వక్తలు

● లోపలి పేజీలో..●

తక్షణం కాల్పుల విరమణ ప్రకటించండి

- గాజాపై బ్రిక్స్ సమావేశంలో జిన్‌పింగ్ పిలుపు
- సమావేశానికి మోడీ గైర్హాజరు

జోహానెస్‌బర్గ్ : ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధంలో తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని చైనా అధ్యక్షులు సీ జిన్‌పింగ్ మంగళవారం పిలుపునిచ్చారు. గాజాపై మంగళవారం జరిగిన బ్రిక్స్ వర్చువల్ సమావేశంలో జిన్‌పింగ్ మాట్లాడుతూ గాజాలో మానవతా సహాయానికి ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని అన్నారు. గాజా నుంచి బలవంతంగా పౌరులను తరలించడాన్ని ఖండించారు. ఇజ్రాయిల్ దాడులతో దెబ్బతిన్న పాలస్తీనా ప్రాంతాల్లో ఆహారం, మంచి నీరు, ఇంధనం, విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న హంతక దాడులపై చర్చించేందుకు ఏర్పాటైన ఈ సమావేశానికి చైనా, రష్యా అధ్యక్షులు జిన్‌పింగ్, పుతిన్ హాజరుగా కాగా, భారత ప్రధాని నరేంద్ర మోడీ ముఖం చాటేశారు. బ్రిక్స్ ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న దక్షిణాఫ్రికా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మోడీకి బదులు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ భారత్ తరపున ప్రాతినిధ్యం వహించారు. రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉండడం వల్లే మోడీ దీనిని దాటవేశారని అధికార వర్గాలు వివరణ ఇచ్చాయి. "బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా , సౌతాఫ్రికా సభ్య దేశాలుగా ఉన్నాయి. సౌదీ అరేబియా, అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్ , యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆహ్వానితుల హోదాలో ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నాయి. ఈ సమావేశంలో ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా పాల్గొన్నారు. శిఖరాగ్ర సమావేశం ముగింపులో ఒక సంయుక్త ప్రకటన విడుదల చేయనున్నట్లు దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది.

సొరంగంలో చిక్కుకున్న కార్మికులు (వీరి విజువల్స్ బయటకు రావడం ఇదే తొలిసారి)

ఉత్తరకాశీ టన్నెల్ ప్రమాదం

10వ రోజూ సొరంగంలోనే...

- తొలిసారిగా బయటకొచ్చిన కార్మికుల విజువల్స్
- మంగళవారం కూడా కొనసాగిన డ్రిల్లింగ్ పనులు
- రిపోర్టింగ్ సమయంలో మీడియా జాగ్రత్తగా వ్యవహరించాలంటూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ హితవు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో టన్నెల్ కూలిపోయిన ప్రమాదం నుంచి కార్మికులను వెలికితీయడం మంగళవారం కూడా సాధ్యపడలేదు. దీంతో వరసగా 10వ రోజూ కూడా కార్మికులు సొరంగంలోనే చిక్కుకుని ఉన్నారు. అయితే తొలిసారిగా సొరంగంలో చిక్కుకున్న కార్మికుల మొదటి వీడియోను సహాయక సిబ్బంది మంగళవారం విడుదల చేశారు. కార్మికులకు ఆహారం, నీరు పంపిస్తున్న 6అంగుళాల ఫుడ్ పైప్‌లైన్ ద్వారా ఒక ఎండోస్కోపిక్ కెమెరాను ఉపయోగించి ఈ విజువల్స్ చిత్రీకరించారు. ఈ వీడియోలో కార్మికులు పసుపు-తెలుపు హెల్మెట్‌లు ధరించి, పైప్‌లైన్ ద్వారా వారికి పంపిన ఆహార పదార్థాలను స్వీకరించడం, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం కనిపిస్తుంది. దీంతో కార్మికులు సురక్షితంగా ఉన్నారనే భావన కలుగుతోంది. కార్మికుల కుటుంబాలకు కాస్త ఊరట లభించింది. ఢిల్లీ నుంచి సోమవారం రాత్రి వచ్చిన ఎండోస్కోపిక్ కెమెరాను పైప్‌లైన్ ద్వారా పంపినట్లు అధికారులు తెలిపారు. నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఐడిసిఎల్) డైరెక్టర్ అన్షు మనీష్ ఖల్కో కొన్ని రోజుల క్రితం మీడియాతో మాట్లాడుతూ కార్మికులు ఎలా ఉన్నారో చూడడానికి పైప్‌లైన్ ద్వారా కెమెరాలను చొప్పించనున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఒక అధికారి మాట్లాడుతూ, సొరంగంలో చిక్కుకున్న కార్మికులకు తగినంత ఆహారం మరియు ఔషధాల సరఫరాను కొనసాగించడానికి 6 అంగుళాల పైప్‌లైన్‌ను ఉపయోగిస్తున్నామని, కార్మికులను రక్షించడానికి కొండపై నుంచి నిట్టనిలువుగా డ్రిల్లింగ్ చేయడంపై దృష్టి పెట్టామని చెప్పారు. అలాగే, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సైట్‌లో మొహరించి ఉన్నాయని తెలిపారు. కార్మికులతో కమ్యూనికేషన్ కోసం పరికారాలను మిగతా 7లో

సోషల్ మీడియాలో పోస్టులు

- ఐటి ఉద్యోగిని అదుపులోకి తీసుకున్న సిఐడి
- విచారణ అనంతరం నోటీసు ఇచ్చి విడుదల

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

సోషల్ మీడియాలో రాష్ట్ర ముఖ్యమంత్రి కుటుంబసభ్యులపై అసభ్యకరంగా పోస్టులు పెట్టారంటూ గుంటూరు జిల్లా పెదవడ్లపూడి గ్రామానికి చెందిన ఐటి ఉద్యోగి జి.రాము (25)ను సిఐడి అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విదేశీ ఐటి కంపెనీకి ఇంటి వద్ద నుంచి విధులు నిర్వహిస్తోన్న ఆయన ఈ ఏడాది ఫిబ్రవరి 16 (మహాశివ రాత్రి రోజు)న పోస్టింగులు పెట్టారు. దాదాపు ఎనిమిది నెలల తరువాత రామును మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకొని మంగళగిరిలోని సిఐడి ప్రధాన కార్యాలయా నికి తరలించారు. రాత్రి వరకు విచారించి అనంతరం విడిచి పెట్టారు. వచ్చే మంగళవారం తిరిగి విచారణకు రావాలంటూ 41 'ఎ' కింద సిఐడి అధికారులు ఆయనకు నోటీసులు అందజేశారు. సిఐడి అధికారి డి.చంద్రశేఖర్ నేతృత్వంలో విచారించారు. అంతకు ముందు పెదవడ్లపూడిలో అరెస్టు చేసిన రామును ఎక్కడ ఉంచిందీ తెలియక ఆయన కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చెందారు. టిడిపి లీగల్ సెల్ విభాగం న్యాయవాదులు ఆరా తీసి మంగళగిరిలో ఉన్నట్టు కనుగొనడంతో ఊపిరిపీల్చుకున్నారు.

చరిత్ర పాఠ్యాంశాలుగా రామాయణ, మహాభారతాలు

- ఎన్‌సిఇఆర్‌టి ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు

రైతును విలన్‌గా ఎందుకు ముద్ర వేస్తున్నారు ?

- పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీం వ్యాఖ్యలు

● లోపలి పేజీలో..●

జాతీయ క్రీడలకు విద్యార్థిని హారిక ఎంపిక

ప్రజాశక్తి- గంపలగూడెం (ఎన్‌టిఆర్ జిల్లా)

సాఫ్ట్ బాల్ (ఫీల్డింగ్ అండ్ బ్యాటింగ్) పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన హారిక జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయ క్రీడల్లో ఆమె పాల్గొననున్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సాఫ్ట్‌బాల్ పోటీల్లో హారిక ప్రతిభ కనబర్చి ఈ అర్హత సాధించారు. దీంతో, ఆమె విద్యనభ్యసిస్తోన్న గంపలగూడెం మండలం సత్యాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషం రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గుర్రం గోపాలరావు, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థినీ, విద్యార్థులు హారికను అభినందించారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

- ఒఎన్‌జిసి పరిహారం పంపిణీలో సిఎం

మత్స్యకార కుటుంబాలకు పరిహారం పంపిణీ సందర్భంగా మాట్లాడుతున్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం ఒఎన్‌జిసి పైపులైన్ వల్ల జీవనోపాధి కోల్పోయిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మత్స్యకార కుటుంబా లకు పరిహారాన్ని క్యాంపు కార్యాలయం నుండి ఆయన బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మత్స్యకార దినోత్సవం సందర్భంగా సూళ్లూరుపేటకు వెళ్లాల్సి ఉందని, వర్షాల కారణంగా ఆ కార్యక్రమానికి వెళ్లలేకపోయా నని చెప్పారు. ఓఎన్‌జిసి పైప్‌లైన్ కారణంగా ఉపాధి కోల్పోయిన 23,458 కుటుంబాలకు నెలకు రూ.11,600 చొప్పున ఆరు నెలలకు రూ.69,000 ఇస్తున్నట్లు తెలిపారు. వీరికి ఇప్పటి వరకు మూడు దశల్లో రూ.323 కోట్లు నష్టపరిహారం ఇప్పించినట్లు తెలిపారు. తాజాగా నాలుగో విడతలో రూ.161.86 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. విశాఖ పట్నంలో 40 బోట్లు కాలిపోయినట్లు తమకు తెలిసిన వెంటనే వాటికి 80 శాతం పరిహారం అందించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. బోట్లకు ఇన్సూరెన్స్ లేదని తెలియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పులికాట్ సరస్సు ముఖద్వారాన్ని పూడిక తీసి, తెరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలనుకున్నామని, ఈ నెలఖరులోనో, వచ్చే నెలలోనే ఆ కార్యక్రమం చేపడతామని తెలిపారు. గతంలో ప్రభుత్వంలో ఉన్న వారు మత్స్యకారులను ఆదుకోవాలనే ఆలోచన చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందించిన ఒఎన్‌జిసి అధికారులకూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు బెయిల్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకు రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో/న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు హైకోర్టు ఇచ్చిన రెగ్యులర్ బెయిల్ తీర్పుపై సుప్రీం కోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాలని సిఐడి పిటిషన్ దాఖలు చేసింది. రెగ్యులర్ బెయిల్ ఇచ్చే సందర్భంలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలు సరికావని రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరిం చిందని, పరిధి దాటినట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. చంద్రబాబు లేవనెత్తని పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవడం సరైంది కాదని పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పు లోపభూయిష్టంగా వుందని, ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరింది. దర్యాప్తు కొనసాగుతుండగా దర్యాప్తులో లోపాలను ప్రస్తావించడం సరైందికాదని పేర్కొంది. సిఐడి కోరిన వివరాలను చంద్రబాబు ఇవ్వలేదని తెలిపింది. బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగే సమయంలో చంద్రబాబు తరపున న్యాయ వాదులు వాదనలు వినిపించలేదని పేర్కొంది. కేసు దర్యాప్తుపై కింది కోర్టు చేయాల్సిన పూర్తిస్థాయి ట్రయల్‌ను హైకోర్టు నిర్వహించినట్లయిందని సుప్రీం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది.

తెలంగాణకు పంపిన 14 మంది ఉద్యోగుల్ని వెనక్కి తీసుకోవాలి

- జనవరి 16 వరకు ఎపి ట్రాన్స్‌కోకు సమయం ఇచ్చిన సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు వ్యతిరేకంగా తెలంగాణకు పంపిన 14 మంది ఎపి ఉద్యోగులను వెనక్కి తీసుకోవాలని ఎపి ట్రాన్స్‌కోకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందుకోసం జనవరి 16 వరకు సమయం ఇచ్చింది. జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు భిన్నంగా తమను తెలంగాణకు పంపారంటూ ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం... ఉద్యోగుల్ని వెనక్కి తీసుకోవడానికి జనవరి 16 వరకు గడువు ఇస్తున్నట్లు వెల్లడించింది. తదుపరి విచారణ అదే రోజు చేపడతామని స్పష్టం చేసింది.

జనవరి 12న పార్లమెంట్ మార్చ్

- ఫిబ్రవరి1న చెన్నైలో ఐక్య ర్యాలీ
- ఎన్ఇపిని తిప్పికొట్టాలి
- 16 విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"బిజెపి, ఆరెస్సెస్ దాడుల నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, తిరోగమనంతో కూడిన జాతీయ విద్యా విధానాన్ని తిప్పికొట్టాలని కోరుతూ జనవరి 12న పార్లమెంటు మార్చ్‌కు ఎస్ఎఫ్ఐ సహా 16 విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ క్యాంపస్‌లు పోరాట కేంద్రాలుగా నిలుస్తాయన్నారు.. కాషాయీకరణే ధ్యేయంగా అమలు చేస్తున్న ఎన్ఇపిని వెనక్కి తీసుకోవాలని, నీట్ పరీక్షలను ఉపసంహరించుకోవాలని, విద్య, ఉపాధి హామీ కోసం భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 'రోహిత్ వేముల' చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను అంతం చేయడానికి, అన్ని క్యాంపస్‌లలో బాలికలపై హింసను నిరోధించడానికి జిఎస్ క్యాస్ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల మంది విద్యార్థులు పార్లమెంటుకు పాదయాత్ర నిర్వహిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 1న చెన్నైలో ఐక్య ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రతిపక్ష నేతలను కలిసి తమ డిమాండ్లను 'ఇండియా' కూటమి ఎన్నికల ఎజెండాలో చేర్చాలని కోరతామన్నారు. మార్చ్‌ను అడ్డుకునేందుకు సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని, ఏది ఏమైనా తాము కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2025లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది పూర్తి చేసుకోనుందని, సంఘ్‌పరివార్ దాడులకు గురవుతున్న దేశ ప్రజాస్వామ్య లౌకిక విలువలు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు విద్యార్థులు సంఘటిత శక్తిగా మారాలని ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్ పిలుపునిచ్చారు. సమావేశంలో డిఎంకె విద్యార్థి విభాగం కార్యదర్శి, కాంచీపురం ఎమ్మెల్యే సివిఎంపీ ఎజి అరసన్, ఏఐఎస్ఏ అధ్యక్షుడు నీలాశిష్ బోస్, ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి నితీశ్ గౌర్, ఏఐఎస్‌బీ కన్వీనర్ సౌమ్యదీప్ సర్కార్, సీఆర్జేడీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక భారతి, సివైఎస్ఎస్ జాతీయ కోఆర్డినేటర్ అనురాగ్ నిగమ్, ద్రవిడియన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్. ప్రిన్స్ ఎన్నారేస్ పెరియార్, డిఎస్ఎఫ్ కార్యదర్శి అన్షా ప్రదీప్, గిరిజన విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి సుజిత్ త్రిపుర, జెఎన్ యుఎస్‌యు అధ్యక్షురాలు ఐషీఘోష్, ఎస్ఎఫ్ఐ నేతలు దీప్సితాదార్, నితీష్ నారాయణ్ పాల్గొన్నారు.

శంకర నేత్రాలయ వ్యవస్థాపకులు బద్రినాథ్ కన్నుమూత

చెన్నై : శంకర నేత్రాలయ వ్యవస్థాపకులు, ప్రముఖ విట్రొరెటినల్ సర్జన్ ఎస్ఎస్ బద్రినాథ్ (83) మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. కొన్ని రోజులుగా బద్రినాథ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. బీసెంట్ నగర్ శ్మశాన వాటికలో మంగళవారం ఉదయం 9:30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1940 ఫిబ్రవరి 24న చెన్నైలో బద్రినాథ్ జన్మించారు. 1962 మద్రాస్ మెడికల్ కాలేజీ నుంచి పట్టబద్రులయ్యారు. అమెరికా వంటి దేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం అనంతరం 1970ల్లో స్వదేశానికి తిరిగివచ్చి, వివిధ ఆసుపత్రుల్లో పనిచేశారు. 1978లో డాక్టర్ బద్రినాథ్ మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్ విభాగంగా శంకర నేత్రాలయను స్థాపించారు. బద్రినాథ్‌కు 1983లో పద్మశ్రీ, 1999లో పద్మభూషణ్ అవార్డులు లభించాయి.

కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ఇళ్లు, కార్యాలయాల్లో

ఐటి సోదాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులే టార్గెట్‌గా తెలంగాణలో ఐటి దాడులు కలకలం రేపుతున్నాయి. ఆ పార్టీ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కెఎల్‌ఆర్, బడంగ్ పేట మేయర్, కాంగ్రెస్ నేత పారిజాత నర్సింహా రెడ్డిల ఇళ్లపై ఇప్పటికే ఐటి దాడులు జరిగాయి. తాజాగా మాజీ ఎంపి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్ లోని సోమాజిగూడ, మంచిర్యాలలోని ఆయన నివాసాలతోపాటు బేగంపేటలోని వివేక్ కార్యాల యంలో నాలుగు బృందాలు మంగళవారం రాత్రి వరకు సోదాలు నిర్వహించాయి. కీలక డాక్యుమెంట్లు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పలు పత్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో లావాదేవీ లపై నిఘా పెట్టిన ఇసి అధికారులు... వివేక్ కుటుం బానికి సంబంధించిన విశాఖ ఇండస్ట్రీస్‌కు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో ఉన్న ఖాతాల నుంచి విజిలెన్స్ సెక్యూరిటీస్ ఐడిబిఐ బ్యాంకు ఖాతాకు ఈ నెల 13న రూ.8 కోట్లు బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలపై అనుమానంతో సిఇఒ వికాస్‌రాజ్ ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులు ఈ నగదును ఫ్రీజ్ చేశారు. ఈ నగదుకు సంబంధించి వివరాల సేకరణకు వివేక్ ఇళ్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు జరిపినట్లు తెలిసింది. ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లోని వ్యాపారులు, రాజకీయవేత్తల ఇళ్లలో కూడా ఐటి అధికారులు దాడులు నిర్వహించారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో రూ.750 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్

8

ఫైబర్‌నెట్ కేసులో టెరాసాఫ్ట్ ఆస్తుల అటాచ్‌కు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఫైబర్‌నెట్ కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ఎసిబి కోర్టు అనుమతినిచ్చింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిందితునిగా వున్న సహ నిందితులకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీ, నెట్‌టాప్స్ సైబర్ సొల్యూషన్స్ కంపెనీలకు చెందిన మొత్తం రూ.114 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు విజయవాడలోని ఎసిబి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. టెరాసాఫ్ట్, నెట్‌టాప్స్ కంపెనీల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సంబంధించి సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం ఎసిబి కోర్టు తీర్పును వెలువరించింది. టెరాసాఫ్ట్ కంపెనీ ఆస్తులు, తుమ్మల గోపీచంద్ ఆయన సతీమణి తుమ్మల పవన దేవి, కనుమూరి కోటేశ్వరరావుకు చెందిన ఆస్తులు జప్తు చేయాలని సిఐడి అభ్యర్థించింది. గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన రూ.114 కోట్ల ఆస్తులను జప్తు చేయాలని కోరింది. నిందితులకు నిధుల దుర్వినియోగం ఆరోపణల కంటే ముందున్న ఆస్తులను ఎలా జప్తు చేస్తారని న్యాయాధికారి ప్రశ్నించారు. దుర్వినియోగం అయిన నిధుల మొత్తానికి విలువచేసే ఆస్తులను జప్తు చేసే అధికారం న్యాయస్థానానికి ఉందని సిఐడి ఈ కేసులో వాదించింది. ఈ మేరకు ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ఎసిబి కోర్టు అనుమతినిచ్చింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

టిడిపితోనే మత్స్యరంగ అభివృద్ధి

- పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మత్స్యరంగ అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మత్స్యకారుల బతుకుల్ని ఛిద్రం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని గంగ పుత్రులకు అంతర్జాతీయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 2014-19 ఐదేళ్లలోనే ఏకంగా రూ.788.38 కోట్లను ఖర్చు చేశామని, ఆదరణ పథకం కింద వలలు, పడవలు, ఐస్ బాక్సులతో సహా ఇతర వృత్తి పరికరాలను 90 శాతం సబ్సిడీతో అందించామని తెలిపారు. మత్స్యకారుల పిల్లల చదువుల కోసం ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించామని పేర్కొన్నారు. ఆక్వా రైతులకు జగన్ ప్రభుత్వం వచ్చాక విద్యుత్తు సబ్సిడీ నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

చలానాల స్కాంలో మాజీ డిజిపి బంధువు అరెస్టు

- రూ.25 కోట్ల ఆస్తుల జప్తు : ఐజి వెల్లడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర పోలీసు శాఖ ట్రాఫిక్ విభాగంలో ఇ-చలానాలకు సంబంధించి వాహనదారులు చెల్లించిన డబ్బులు పోలీసు శాఖకు చేరకుండా సాంకేతికతతో రూ.37 కోట్ల నిధులు స్వాహా చేసిన కేసులో మాజీ డిజిపి నండూరు సాంబశివరావు బంధువు కొమ్మిరెడ్డి అవినాష్‌ను అరెస్టు చేసినట్టు గుంటూరు రేంజి ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి) పాలరాజ్ మంగళవారం మీడియాకు తెలిపారు. మాజీ డిజిపి నండూరు సాంబశివరావు అల్లుడైన అవినాష్‌కు చెందిన రేజర్ పిఇ ఖాతాకు చలానాల సొమ్ము మళ్లించిన వ్యవహారంలో దర్యాప్తు చురుగ్గా సాగుతోందని చెప్పారు. ఇప్పటికే రూ.25 కోట్ల ఆస్తులను జప్తు చేశామని తెలిపారు. 2018 జూన్ 27న ప్రారంభమైన ఈ చలానాల అక్రమాలు గతేడాది వరకు కొనసాగాయని చెప్పారు. మొత్తం రూ.37 కోట్ల నగదు దారిమళ్లీనట్టు గుర్తించామని తెలిపారు. డేటా ఎవాల్వింగ్, రేజర్ పేయా సంస్థలకు ఈ కుంభకోణంలో భాగస్వామ్యం ఉండడంతో ఈ రెండు సంస్థలను మూసివేసినట్టు చెప్పారు.

కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- ఐక్యపోరాటాలకు సన్నద్ధం కావాలి
- సిపిఐ 30గంటల నిరసన దీక్షలో వక్తలు

సిపిఐ 30 గంటల నిరసన దీక్షలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, చిత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణం రైతులను, ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం కరువు సహాయక చర్యలను చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, కృష్ణాజలాల పున:పంపిణీ గెజిట్‌ను రద్దు చేయాలనే అంశాలలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సిపిఐ ఆద్వర్యంలో చేపట్టిన 30 గంటల నిరసన దీక్షలు మంగళవారం ముగిశాయి. విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగిన ఈ నిరసన దీక్షలకు రాజకీయపార్టీలు, రైతు సంఘాలు, ప్రజాసంఘాలు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన హక్కుల విషయంలో కేంద్రాన్ని నిలదీయలేక సాగిలపడిందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. బలమైన పార్టీగా, పటిష్టమైన ప్రభుత్వంగా ఉండి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయలేకపోవడం సరైంది కాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబాన్ని కాపాడుకోవటం కోసం కేంద్రం వద్ద సాగిలపడుతున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీ చేయాలని, వలసల నివారణకు ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కోరారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కరువు మండలాలను ప్రటించటానికి ముఖ్యమంత్రికి నామోషీగా వుందన్నారు. రాష్ట్రమంతటిని కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు సహాయక చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ వల్ల మిగులు జలాల్లో ఒక్క టీఎంసీ నీరు కూడా రాష్ట్రానికి వచ్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. పోలవరం ఎప్పటికి పూర్తవుతుందో తెలియదని చెపుతున్న వైసీపీ ప్రభుత్వం మిగతా ప్రాజెక్టుల గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువుతో ప్రజలు అల్లాడుతున్నా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, అమరావతి బహుజన జెఎసి నాయకులు పోతుల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కరువు లేదంటూ రాష్ట్రప్రభుత్వం కళ్లు మూసుకోవడం తగదు

వి శ్రీనివాసరావు

రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నా ఎక్కడా కరువు లేదని రాష్ట్ర ప్రభుత్వం కళ్లు మూసుకోవడం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రంలో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఆయా పంటలనుబట్టి ఎకరాకు రూ.25 వేల నుండి రూ.50వేల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సెప్టంబర్ ఆఖరుతో ఖరీఫ్ ముగుస్తుందని, అక్టోబర్ నాటికి సర్వే చేసి నష్టాన్ని అంచనా వేసి నవంబర్ నాటికి సహాయక చర్యలు చేపట్టాల్సి వున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా అలాంటి చర్యలను తీసుకోలేదని విమర్శించారు. కేంద్రం విద్యుత్ సవరణ బిల్లును తెస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఏ మాత్రం ఆలోచించకుండా మద్దతునివ్వడం తగదని అన్నారు. అదానీ ప్రయోజనాల కోసం విద్యుత్ చార్జీలను భారీగా పెంచారని విమర్శించారు. కేంద్ర బృందాలను రాష్ట్రానికి రప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రజలు కరువు తీవ్రతను తట్టుకోలేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు తాను కరువు లేదని అంతా బాగుందని ఫీల్ కావడం తగదని విమర్శించారు. రైతాంగ సమస్యలు, నిత్యావసర ధరలపై ఈ నెల 27, 28 తేదీల్లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

క్యాబినెట్ ఆమోదంతోనే ...

- మద్యం కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు
- నేటికి వాయిదా

ప్రజాశక్తి - అమరావతి

మద్యం షాపుల లైసెన్స్ ప్రివిలైజ్ ఫీజు విధింపు నిబంధనను చట్టం నుంచి తొలగించాలన్న ప్రతిపాదన ఎక్సైజ్ కమిషనర్ నుంచి రావడంతో క్యాబినెట్ ఆమోదంతో రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తరపు న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం చేకూరిందని పేర్కొంటూ బెవరేజెస్ కార్పొరేషన్ ఎమ్‌డి వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మూడో నిందితుడిగా చంద్రబాబును చేర్చుతూ సిఐడి నమోదు చేసిన కేసును కొట్టేయాలని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు విచారణ చేపట్టారు. చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ, ఫీజు తొలగింపు అంశంపై సభలో చర్చ జరిగినప్పుడు నేటి సిఎం, నాటి విపక్ష నేత వైఎస్ జగన్ కూడా ఉన్నారన్నారు. ప్రతిపక్షంలో వైసిపి ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని, ఎవ్వరూ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదని తెలిపారు. కమిషనర్ నుంచి వచ్చిన ప్రతిపాదన అనేక దశల తర్వాత మంత్రికి చేరిందని, ప్రివిలేజ్ ఫీజు తొలగింపునకు గవర్నర్ ఆమోదముద్ర కూడా వేశారన్నారు. క్యాబినెట్, అసెంబ్లీ, గవర్నర్ ఆమోదించిన అంశాలపై న్యాయ సమీక్షకు ఆస్కారం లేదన్నారు. చంద్రబాబు తరపు వాదనలు ముగియడంతో సిఐడి తరపు వాదనల నిమిత్తం విచారణ బుధవారానికి వాయిదా పడింది.

మాజీ మంత్రి కొల్లు తరఫున వాదనలు

ఇదే మద్యం కేసులో రెండో నిందితుడు మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన తరపున సీనియర్ లాయర్ పోసాని వెంకటేశ్వర్లు వాదించారు. ప్రివిలేజ్ ఫీజు తొలగింపు నిర్ణయం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగి ఉంటే ఇప్పటి ప్రభుత్వం బార్ లైసెన్స వ్యవహారంపై ప్రివిలేజ్ ఫీజును ఎందుకు పునరుద్ధరించలేదని ప్రశ్నించారు. ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు. ఈ కేసులో తొలి నిందితుడైన, ఎక్సైజ్ శాఖ నాటి కమిషనర్ శ్రీనివాస శ్రీనరేష్ ముందస్తు బెయిలు మంజూరు చేయాలన్న పిటిషన్‌ను కూడా హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సిఐడిని కోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

టిడిపి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోంది

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే పేరుతో చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఫోన్ నెంబర్, ఓటర్ ఐడి, ఇతర సమాచారాన్ని సేకరిస్తున్నారని అన్నారు. సమాచారాన్ని సేకరించిన తర్వాత ఓటిపి వస్తుందని, తద్వారా రాష్ట్రంలో 2024 జూన్ నుండి తమ ప్రభుత్వం వచ్చాక ఇచ్చే రూ.2,40,000 పథకానికి అర్హులయ్యారని ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. విదేశీ లాటరీ, లోన్ యాప్ తరహాలో ప్రజలను తెలుగుదేశం మోసం చేస్తోందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినట్లు పథకానికి లబ్దిదారులుగా ఎంపికైనట్లు ప్రజలను భ్రమల్లోకి నెడుతున్నారని విమర్శించారు. 2014లో నరేంద్రమోడి, పవన్‌కల్యాణ్‌లతో కలిసి చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోను అమలు చేయకుండా మాయం చేసి, మళ్లీ ఇప్పుడు ఎన్నికల కోసం కొత్త నాటకం ఆడుతున్నారని అన్నారు. తెలుగుదేశం చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు.

పర్మినెంట్ చేసేదెప్పుడు?

- రెండోరోజూ కదంతొక్కిన మున్సిపల్ కార్మికులు
- కలెక్టరేట్ల వద్ద వంటా-వార్పు

అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద రోడ్డుపై కూర్చొని భోజనం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని సిఎం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు రెండో రోజూ నిరసన కార్యక్రమాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. అనంతరం అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం కూడా ఆందోళన కొనసాగించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీలకు చెందిన కార్మికులు వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ... కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి, నేడు ఆ హామీని సిఎం జగన్ అమలు చేయలేదని విమర్శించారు. అతి తక్కువ వేతనాలు ఇచ్చి వారితో వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయుడు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, ఏలూరు కలెక్టరేట్ల వద్ద వంటా-వార్పు కార్యక్రమం చేపట్టారు. ఏలూరులో కార్మికుల నిరసననుద్దేశించి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ రెండు పదాలలో తేడా తప్ప చదువులూ, పనులూ ఒకటేనని గొప్పలు చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి.. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి, అవుట్ సోర్సింగ్ కార్మికులు విస్మరించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27, 28న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం కలిసివచ్చే సంఘాలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్త సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. వంటావార్పుతో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రోడ్డుపైనే సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబుల, మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ పాల్గొన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు తగిన వేతనాలు చెల్లించకుండా వారిని రాష్ట్ర ప్రభుత్వం మోసగిస్తోందన్నారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టిన అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఒంగోలులో కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. వర్షంలోనూ కార్మికులు తమ నిరసన కొనసాగించారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వంటావార్పు నిర్వహించారు. కడప జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నుంచి కార్మికులు తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట వంటా వార్పు చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలెక్టరేట్ వద్ద వంటా వార్పు నిర్వహించారు. నరసరావుపేటలో స్థానిక ధర్నా చౌక్ వద్ద వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం నిర్వహించి అక్కడే భోజనాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఫిషింగ్ హార్బర్ ప్రమాద ఘటనపై అధికారులతో కమిటీ

- నేటి సాయంత్రానికి నివేదిక

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, నాయకులు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అర్ధరాత్రి 36 చేపల బోట్లు పూర్తిగా, 9 బోట్లు పాక్షికంగా అగ్నికి ఆహుతైన ఘటనపై విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం అధికారులతో కమిటీని నియమించారు. ఈ కమిటీ బుధవారం సాయంత్రానికి విచారణ పూర్తి చేసి ప్రమాదానికి కారణాలను నివేదించనుంది. కమిటీకి చైర్మన్‌గా విశాఖపట్నం ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ వ్యవహరించనున్నారు. హార్బర్ ఏరియా ఎసిపి, ఫిషరీస్ విశాఖపట్నం జాయింట్ డైరెక్టర్, జిల్లా అగ్నిమాపక అధికారి కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వీరు మంగళవారమే తమ పనిని మొదలుపెట్టారు.

బోట్లన్నీ ఎండు చేపలు అమ్మేచోటుకు మార్పు

హార్బర్‌లో బోట్లు 1100 వరకూ ఉంటాయి. వీటిలో 500 బోట్లు చేపలు వేలం వేసే జెట్టీ వద్ద లంగరు వేసి ఉంటాయి. మిగతావి వేటకు వెళ్తుంటాయి. తాజాగా జరిగిన ప్రమాదం అనంతరం ఈ బోట్లను ఎండు చేపలు అమ్మే చోటుకు మార్పు చేశారు. రెండు రోజుల విచారణ అనంతరం యధాతథ ప్రదేశంలో బోట్లను నిలిపే అవకాశం ఇవ్వాలని మత్స్యశాఖ, పోర్టు అధికారులు ఆలోచిస్తున్నారు.

పోర్టు ఆధ్వర్యంలో బోట్ల వెలికితీత

ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన ప్రమాదంలో కొన్ని బోట్లు కాలి బూడిదయ్యాయి. మరికొన్నింటి శకలాలు, ఇంకొన్ని బోట్లు మునిగిపోయాయి. వీటిని పోర్టు అధికారులు వెలికి తీయనున్నారు. గతంలో సుమారు 20 వరకూ బోట్లు జెట్టీ వద్దనే మునిగిపోయాయి. అవి కిందనే ఉండిపోవడంతో బోట్లు నిలుపుకునే అవకాశం లేకుండా పోయింది. పోర్టు అధికారులు వీటిని వెలికితీయడంలో తీవ్ర తాత్సారం ప్రదర్శించారు. తాజా ఘటనతోనైనా వీరిలో కదలిక వచ్చి గత బోట్లను కూడా వెలికి తీస్తే తమకు యాంకరింగ్ సమస్య ఉండదని మత్స్యకారులు అధికార యంత్రాంగాన్ని కోరారు.

బాధితులకు పలు పార్టీల నేతల పరామర్శ

హార్బర్‌లో బోట్లు దగ్ధమైన ప్రాంతాన్ని వైసిపి, టిడిపి, బిజెపి నాయకులు పరిశీలించారు. బాధిత మత్స్యకారులను పరామర్శించారు. వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి బాధితులను పరామర్శించి మాట్లాడుతూ ప్రమాద కారకులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఏడుగురు అనుమానితులను పోలీసులు అదుపులో తీసుకొని విచారణ చేస్తున్నారని చెప్పారు. ఆ ప్రాంతంలో ఉన్న సిసి కెమెరాలు ఎందుకు పనిచేయలేదన్న దానిపై విచారణ చేపట్టాలని సిపిని కోరామన్నారు. ఆయన వెంట జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఉన్నారు. సంఘటనా స్థలాన్ని టిడిపి మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర పరిశీలించి మాట్లాడారు.

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రాక

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఉదయం 8 గంటలకు ప్రమాద స్థలంలో పర్యటించి, బాధితులను పరామర్శించనున్నారు.

విజయనగరం జిల్లా వేపాడలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

పలు జిల్లాల్లో జల్లులు

- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల అగచాట్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీనడం ద్రోణి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. వరికోతలు ప్రారంభమవుతున్న దశలో జల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతల సమయంలో వర్షం పడితే తీవ్రంగా నష్టపోతామని భయపడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జికె.వీధి, కొయ్యూరు, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కోత దశకు వచ్చిన, ఇప్పటికే కోసిన వరి పంటకు నష్టం వాటిల్లింది. జికె.వీధి మండలం ధారకొండ, దుప్పిలివాడ, కొమ్ములవాడ తదితర గ్రామాల్లో కోసిన వరి పంట తడిసి ముద్దయినట్లు గిరిజన రైతులు తెలిపారు. విజయనగరం జిల్లాలో కురిసిన స్వల్ప వర్షానికి పొలాల్లో కోత కోసి ఉంచిన వరి చేలు తడిచిపోయాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడ్డారు. వంగర, లక్కవరపుకోట, విజయనగరం, మెంటాడ, దత్తిరాజేరు, గజపతినగరం తదితర మండలాల్లో చిరు జల్లులు కురిశాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, భీమవరం, పెనుమంట్ర, మొగల్తూరు తదితర మండలాల్లో జల్లులు పడడంతో ముసురు వాతావరణం నెలకొంది. దీనికితోడు చలిగాలుల తీవ్రత పెరగడంతో జనం ఇబ్బందులు పడ్డారు. సార్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న సమయంలో చిరుజల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశం లేకపోవడంతోపాటు, ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఏలూరు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంది. నెల్లూరు నగరంలో కురిసిన వర్షానికి రోడ్లపైకి నీరు చేరింది. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. ఒక్క రోజులోనే 33.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా మున్సిపల్ అధికారులు అప్రమత్తం అయ్యారు. తిరుపతి జిల్లా కోట మండల పరిధిలో ఎడతెరిపిలేని భారీ వర్షం కురవడంతో వాగులు, చెరువుల్లోకి వర్షపు నీరు చేరింది.

కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మంత్రి రోజా

నగరి కోర్టుకు మంత్రి రోజా

- తనపై చేసిన వ్యాఖ్యలపై కోర్టులో స్టేట్‌మెంట్

ప్రజాశక్తి- నగరి (చిత్తూరు జిల్లా)

తన వ్యక్తిత్వంపై నీచపు వ్యాఖ్యలు చేసిన కేసులో మంత్రి రోజా కోర్టుకు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. మంత్రి రోజాను కించపరిస్తూ గతంలో బండారు సత్యనారాయణమూర్తి, టివి5 అసోసియేట్ ఎడిటర్ రాజేంద్రప్రసాద్, గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఆమె నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. ఆమె స్టేట్‌మెంట్‌ను మెజిస్ట్రేట్ విష్ణువర్మ రికార్డు చేశారు. కోర్టు నుంచి బయటకు వచ్చిన అనంతరం రోజా మీడియాతో మాట్లాడారు. మహిళలను ఏదైనా అనవచ్చు అనుకునే మగవారికి బుద్ధిచెప్పాలన్నదే తన ప్రయత్నమన్నారు. మహిళలను అణగదొక్కాలంటే ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిస్తే చాలనుకునే ప్రాచీన సమాజం మారి మహిళలు అభివృద్ధి పథంలో నడుస్తున్నా టిడిపి నాయకులు మాత్రం మహిళా సాధికారతను కాలరాస్తున్నారని విమర్శించారు. తనను అడ్డుతొలగిస్తే వారిని ప్రశ్నించే వారు ఎవరూ ఉండరని ఒక పథకం ప్రకారం తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత అయ్యన్నపాత్రుడి నుంచి మొదలై బండారు సత్యనారాయణమూర్తి, టివి 5 అసోసియేట్ ఎడిటర్ రాజేంద్ర ప్రసాద్, గాలి భాను ప్రకాష్ అంటూ ఒకరి తరువాత ఒకరు తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ మాట్లాడారన్నారు.

మూడు సెక్షన్ల క్రింద కోర్టు నోటీసులు

బండారు సత్యనారాయణమూర్తి, టివి5 అసోసియేట్ ఎడిటర్ రాజేంద్ర ప్రసాద్, గాలి భానుప్రకాష్‌లపై మూడు సెక్షన్ల క్రింద విడివిడిగా కోర్టు నోటీసులను అందించినట్లు మంత్రి రోజా తరపు న్యాయవాది రవీంద్ర తెలిపారు. పరువునష్టం కలిగించినందుకు 499, 500 ఐపిసి సెక్షన్ కింద, మహిళపై నిందమోపి భయబ్రాంతులకు గురిచేసినందుకు ఐపిసి 354, 506 సెక్షన్ల కింద కేసులు, ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉన్నందున సెక్షన్ 153ఎ కింద నోటీసులు అందించామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై విచారణ చేస్తాం : సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదిపై ఉన్న జల విద్యుత్ కేంద్రాలు కూడా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్‌ఎంబి) పరిధిలోకి తేవాలంటూ మధ్యంతర ఉపశమనం కోరిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తిపై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2021లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఓ 34ను రద్దు చేయాలని, కృష్ణా నదిపై జల విద్యుత్ కేంద్రాలు కెఆర్‌ఎంబి పరిధిలోకి తీసుకురావాలంటూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఒకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో ఉన్న వేరొక పిటిషన్‌కు ఈ పిటిషన్ జత చేసిందని అన్నారు. అయితే ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించిన పిటిషన్‌కు జత చేసిన పిటిషన్ ఇది కాదని, అది వేరొక పిటిషన్ అని అన్నారు. ధర్మాసనం వద్ద ఉన్న కేసు, ఈ పిటిషన్‌లో ఉన్న అంశం వేర్వేరని అన్నారు. దీంతో జస్టిస్ ఒకా జోక్యం చేసుకుని తాము ఏం చేయాలని ఇరు రాష్ట్రాలను అడిగారు. దీనికి స్పందించిన తెలంగాణ తరపు న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ ఈ పిటిషన్‌ను ఇప్పటికే ఉన్న పిటిషన్లతో జత చేయాలని, లేకపోతే ఆ పిటిషన్లు విచారించినప్పుడే ఈ పిటిషన్‌ను కూడా విచారించాలని కోరారు. ఆ పిటిషన్లలో ఏం ఉన్నాయో వివరాలు తమకు తెలియదని, కనుక ఆయా వివరాలు ధర్మాసనానికి అందజేయాలని జస్టిస్ అభయ్ ఎస్ ఒకా ఆదేశించారు. అయితే ఎపి ప్రభుత్వం కోరిన మధ్యంతర ఉపశమనానికి సంబంధించి విచారణ చేపడతామని స్పష్టం చేశారు. తదుపరి విచారణ డిసెంబరు 12కు వాయిదా వేశారు.

54 మంది ఇఒలకు నియామక పత్రాలు

- హథీరాంజీ మఠం మహంతుగానున్న అర్జున్‌దాస్ తొలగింపునకు నిర్ణయం
- మంత్రి కె సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిపిఎస్‌సి ద్వారా ఎంపికైన 59 మంది గ్రేడ్-3 ఇఒల్లో 54 మందికి నియామక పత్రాలు జారీ చేసినట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. సచివాలయంలోని నాల్గో బ్లాక్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపికైన వారిలో మిగిలిన వారు హాజరుకాకపోవడం వల్ల వారికి నియామక పత్రాలను జారీ చేయలేకపోయా మన్నారు. రాష్ట్ర ధార్మిక పరిషత్తు సమావేశంలో తిరుపతి హథీరాంజీ మఠానికి గతంలో మహంతుగానున్న అర్జున్‌దాస్‌ను తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో పాటు ఆ మఠానికి చెందిన అన్ని రకాల ఆస్తులనూ తాత్కాలికంగా నియమించిన ఫిట్ పర్సన్ అయినటువంటి రమేష్‌నాయుడుకు అప్పగించాల్సిందిగా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు మంత్రి తెలిపారు. అర్జున్‌దాస్ గతంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు త్రిసభ్య కమిటీ విచారణలో స్పష్టమైందని, ఆయనపై మోపిన 16 అభియోగాలకు వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసు కూడా జారీ చేశామన్నారు. ఈ నెల 16న జరిగిన ధార్మిక పరిషత్ సమావేశానికి అర్జునదాస్ ఇద్దరు న్యాయవాదులతో హాజరై అభియోగాలపై సరైన వివరణ ఇవ్వకుండానే.. తనను మహంతుగా కొనసాగించాలని కోరారన్నారు. రాష్ట్రంలోని 3,208 మంది అర్చకులకు ప్రతినెలా రూ.3.87 కోట్లను గౌరవ వేతనంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు.

కాకినాడ తీరంలో పడవ బోల్తా

- ఇద్దరు మత్స్యకారుల మృతి

మైలపల్లి కపాదాస్(ఫైల్)

సత్తిరాజు (ఫైల్)

ప్రజాశక్తి-కాకినాడరూరల్

కాకినాడ తీరంలో పడవ బోల్తా పడడంతో ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి సూర్యారావుపేట నుంచి ఐదుగురు మత్స్యకారులు చేపలవేట కోసం హోప్ ఐలాండ్ ప్రాంతానికి పడవపై వెళ్లారు. అప్పటికే బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. వేట ముగించుకొని వారు తిరిగి వస్తుండగా అలల ఉధృతికి పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. దుమ్మలపేటకు చెందిన మైలపల్లి కపాదాస్ (38), సూర్యారావుపేటకు చెందిన గరికనేని సత్తిరాజు (55) సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను కాకినాడ తీరంలో పోలీసులు మంగళవారం కనుకొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన విషయాన్ని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. తక్షణ సాయంగా రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆదేశించారు.

450 మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి

- పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం చేపల రేవులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన యజమానులతోపాటు సంబంధిత బోట్లలో పనిచేసే 450 మత్స్యకార కుటుంబాలనూ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోటు యజమానులకు సిఎం జగన్ 80 శాతం నష్ట పరిహారం ప్రకటించడం హర్షణీయమన్నారు. నష్టపరిహారం అందిన తరువాత బోటు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి దాదాపు ఐదు నుంచి ఆరు నెలలు పడుతుందని తెలిపారు. ఎటువంటి ఉపాధి లేనందున మత్స్యకార కుటుంబాలను ఆరు నెలలపాటు ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. జెట్టి ప్రాంతాల్లో రాత్రిపూట నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

తేమ పేరుతో మిల్లర్ల దోపిడీ

- 75 కిలోల ధాన్యం బస్తాకు 8 నుంచి 9 కిలోల వరకు అదనపు తూకం
- ఆరబెట్టే అవకాశం లేక కోసిన వెంటనే విక్రయిస్తున్న రైతులు
- ఆకాశం మేఘావృతంతో ఆందోళనలో అన్నదాతలు

కృష్ణా జిల్లా కంకిపాడులో ధాన్యాన్ని కాటా వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, అమరావతి బ్యూరో

వరి పండించిన రైతులను ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు కుంగదీస్తుండగా, మరోవైపు రైస్ మిల్లర్లు దోచుకుంటున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నూర్పిళ్లు పూర్తయిన ధాన్యంలో తేమను ఆరబెట్టుకునే అవకాశం లేకపోవడంతో వెంటనే మిల్లులకు తోలాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకొని ఆర్‌బికెల ద్వారా విక్రయించిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉందనే పేరుతో మిల్లర్లు మద్దతు ధరలో కోత విధిస్తున్నారు. బస్తాకు ఎనిమిది నుంచి తొమ్మిది కిలోల వరకు తరుగు కింద మినహాయిస్తున్నారు. అయినా, గత్యంతరంలేని పరిస్థితుల్లో అమ్ముకోక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

కృష్ణా జిల్లాలో గత ఖరీఫ్ సీజన్లో 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం పలు మండలాల్లో కోతలు, నూర్పిళు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురు జల్లులు కురిశాయి. దీంతో, కోత కోసి నూర్చిన ధాన్యాన్ని నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో రైతులు వెంటనే అమ్ముకోవాల్సి వస్తోంది. కంకిపాడు, బంటుమిల్లి, గుడివాడ, గూడూరు, మోపిదేవి, మచిలీపట్నం, మొవ్వ, పామర్రు తదితర మండలాల్లోని 24 ఆర్‌బికెల పరిధిలో రైతులు 1,442 టన్నుల ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించారు. ధాన్యంలో తేమ శాతం 17 ఉండాలంటూ, 26 శాతం వరకు ఉందంటూ మిల్లర్లు వంకలు పెడుతున్నారు. 75 కిలోల బస్తాకు 17 శాతానికి అదనంగా ఉన్న ఒక్కో పాయింట్ తేమ శాతానికి ఒక్కో కిలో చొప్పున తరుగుకింద మిల్లర్లు మినహాయించుకుంటున్నారు. ఒక్కో బస్తాకు రైతులు తొమ్మిది కిలోల వరకు కోల్పోవాల్సి వస్తోంది. సాధారణ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1637.25, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.1652 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు చెబుతున్నా, తేమ శాతం వంకతో మిల్లర్లు తీసుకుంటున్న అదనపు తూకాన్ని (9 కిలోలు) పరిగణలోకి తీసుకుంటే రైతులు రూ.196.47 నుంచి రూ.198.27 వరకు కోల్పోతున్నారు. మరికొందరు రైతుల నుంచి మిల్లర్లే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. 75 కిలోల బస్తాకు రూ.1300 మాత్రమే ధర చెల్లిస్తున్నారు. మిల్లర్లకు నేరుగా అమ్మిన రైతులు బస్తాకు రూ.337 నుంచి రూ.352 వరకు నష్టపోతున్నారు.

శాస్త్రీయత ఏదీ?

ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టింది. వర్షాలు కురిసి ఆరబెట్టడానికి వీలులేని ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం నిబంధన రైతులకు చేటు చేస్తోంది. తేమ శాతం నిర్ధారించే యంత్రాల్లో అధిక ఒత్తిడి కలిగించి ఎక్కువ తేమ ఉందని చూపుతూ రైతులను మిల్లర్లు దోచేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్న పరిస్థితుల్లో పచ్చి ధాన్యం విక్రయించినప్పుడు తాము నష్టపోకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వాస్తవ తరుగు ఎంత ఉంటుందో శాస్త్రీయంగా నిర్ధారించి అంతవరకు మాత్రమే అదనపు ధాన్యం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మందకొడిగా కొనుగోళ్లు

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యాన ఈ నెల మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 680 మండలాల్లో 2,887 రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికెలు) ఉన్నాయి. తూర్పుగోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కాకినాడ, కృష్ణ జిల్లాల్లోని 506 ఆర్‌బికెల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన జిల్లాల్లో సేకరణ ప్రారంభం కాలేదు. ఇప్పటి వరకు రూ.149.16 కోట్ల విలువైన 68 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 9,664 మంది రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. 3,596 మంది రైతులకు రూ.50.11 కోట్లు చెల్లింపులు జరిపినట్లు, 6,068 మంది రైతులకు రూ.99.05 కోట్లు బకాయిలు ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. రవాణా వాహనాలకు అమర్చిన జిపిఎస్ యంత్రాలు సాంకేతిక సమస్యతో మిల్లర్ల వద్ద ఓపెన్ కాకపోవడంతో ధాన్యం అప్‌లోడ్ ఆలస్యమవుతోందని, ఫలితంగా వెయిటింగ్ ఛార్జీలు పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

50 శాతం సబ్సిడీతో టార్పాలిన్లు సరఫరా చేయాలి

ఏ క్షణమైనా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో కళ్లాలోని ధాన్యాన్ని రక్షించుకునేందుకు గతంలో మాదిరిగా 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను ప్రభుత్వం సరఫరా చేయాలని వ్యవసాయ, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ధాన్యంలో తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

బేడీలతో ఖైదీ పరారీ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం జిల్లా కోర్టు నుంచి బేడీలతో మంగళవారం ఓ ఖైదీ పోలీసుల కళ్లుకప్పి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పిల్లి నూకరాజు ఓ చోరీ కేసులో నిందితుడు. ఆయనతోపాటు మరికొంత మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. వీరిని మంగళవారం జిల్లా కోర్టులో వాయిదాకు తీసుకొచ్చారు. వాయిదా అనంతరం సెంట్రల్ జైలుకు తరలించేందుకు వ్యాన్ వద్దకు తీసుకెళ్తుండగా, మూత్రవిసర్జనకు వెళ్లి వస్తానని చెప్పి పోలీసుల చెరనుంచి బేడీలతో నూకరాజు పరారయ్యాడు. ఈ విషయాన్ని పోలీసులు వెంటనే సెంట్రల్ జైలు ఉన్నతాధికారులకు, కోర్టు వారికి తెలియజేశారు. మిగతా నిందితులను జైలుకు తరలించారు. నిందితుడు నూకరాజుపై పలు కోర్టుల్లో కేసులు ఉన్నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించండి

- హెల్త్ డైరెక్టరుకు

సచివాలయాల ఎఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఎఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఆరోగ్య కార్యదర్శులు గవర్నమెంటు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు స్నేహలత, సీతామహాలక్ష్మి కోరారు. కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరు జె నివాస్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అర్హత ఉన్నవారికి ప్రమోషన్ ఇవ్వాలన్నారు. పని ఒత్తిడి కారణంగా కులగణన సర్వే నుంచి హెల్త్ సెక్రటరీలకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇది వరకే జిఎన్‌ఎమ్ అర్హత కలిగిన వారికి స్టాఫ్ నర్స్ లేదా ఎంఎల్‌హెచ్‌పి ప్రమోషన్ అవకాశం కల్పించాలన్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి ఏదీ?

- పవన, సౌర విద్యుత్ ఉత్పత్తిపై కనిపించని శ్రద్ధ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రత్యామ్నాయ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రాష్ట్రంలో వనరులున్నప్పటికీ ఆ దిశలో ప్రయత్నాలు మాత్రం పూర్తిస్థాయిలో జరగడం లేదు. పవన, సౌర విద్యుత్‌కు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్న అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతోంది. పాలసీలను అట్టహాసంగా ప్రకటించినప్పటికీ ఉత్పత్తి సంస్థలను ఆహ్వానించడంలో, ఆకర్షించడంలో ఇవి ఫలవంతం కావడం లేదు. దీంతో ఉత్పత్తి సింగిల్ డిజిట్ మెగావాట్లకే పరిమితమవుతోంది.

2019లో జాతీయ పవన విద్యుత్ సంస్థ తయారుచేసిన అంచనాల మేరకు రాష్ట్రంలో 44,229 మెగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయి. ఈ విద్యుత్ గాలిలో వంద మీటర్ల ఎత్తు వరకు అందుబాటులో ఉంటుందని తేల్చారు. అలాగే 38,200 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి కూడా అవకాశాలు ఉన్నాయి. ఈ రెండు రంగాల్లో కలిపి 82,429 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవకాశాలు ఉన్నట్లు తేలింది. పవన విద్యుత్‌కు సంబంధించి 2018లోనే పాలసీని రాష్ట్రప్రభుత్వం ప్రకటించగా, తరువాత వచ్చిన కొత్త ప్రభుత్వం 2019, 2021 సంవత్సరాల్లో ఈ పాలసీకి సవరణలు చేసింది. అయినప్పటికీ ఏ సంస్థ ముందుకు రాలేదు. దీంతో 2021-22లో ఒక్క మెగావాట్ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయలేకపోయారు. అయితే సాంప్రదాయేతర ఇంధన సంస్థ మాత్రం సొంతంగా 16.80 మెగావాట్లను ఉత్పత్తి చేసుకోగలిగింది. అందుబాటులో ఉన్న దానిలో ఇది నామమాత్రమే.

సౌర విద్యుత్ పాలసీని 2019, 2021లో సవరణలు చేసినప్పటికీ ఏమాత్రం ఉపయోగం కనిపించడం లేదని అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పాలసీ మేరకు 2021-22లో 151.91 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులు ఏర్పాటైనప్పటికీ ఉత్పత్తి మాత్రం జరగలేదని చెబుతున్నారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో కేవలం పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా కేవలం 8.2 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

కాలువలో ఇరుక్కుపోయిన ధాన్యం లారీ

కూలిన వంతెన

- హెచ్‌ఎల్‌సి కాలువలో పడిన ధాన్యం లారీ

ప్రజాశక్తి-కణేకల్లు

అనంతపురం జిల్లా కణేకల్లు మండలం గంగులాపురం నుంచి మచ్చుమర్రికి వెళ్లే రహదారి మధ్యలో హై లెవెల్ కెనాల్ (హెచ్‌ఎల్‌సి)పై ఉన్న వంతెన కుప్పకూలింది. ఆ సమయంలో వంతెనపై వెళ్తున్న ధాన్యం లారీ ఒక్కసారిగా కిందకు కూలిపోయింది. దీంతో లారీ కాలువలో ఇరుక్కుపోయింది. స్థానికుల కథనం మేరకు.. గంగులాపురం గ్రామంలోని కొందరు రైతుల నుంచి వరి ధాన్యాన్ని ఓ వ్యాపారి కొనుగోలు చేశారు. 120 బస్తాలను ఐచర్ వాహనంలో కణేకల్లుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మచ్చుమర్రి వద్ద ఉన్న హెచ్‌ఎల్‌సి కాలువ వద్దకు రాగానే ఒక్కసారిగా బ్రిడ్జి కూలిపోయింది. దీంతో ఐచర్ వాహనం వెనుక చక్రాలు కాలువలో ఇరుక్కుపోయాయి. అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ లారీ నుంచి బయటకు దూకేశారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో లారీలో ఉన్న వరి ధాన్యం బస్తాలను బయటకు తీశారు. కాగా ఈ వంతెన చాలా పాతది అని, మరమ్మతు చేయించాలని గ్రామస్తులు చాలాకాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నా ఫలితం లేకపోయింది.



వెలువడినది
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
పాలస్తీన ప్రజలపై ఇజ్రాయిల్ యుద్ధం
తక్షణం యుద్ధ విరమణ జరగాలి!
రెండు దేశాల పరిష్కారాన్ని అమలు చేయాలి!!
ఇజ్రాయిల్ దురాక్రమననుండి
పాలస్తీనాను విముక్తి చేయాలి!!!
వెల : 10/-
ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 9490099061, 9490099057
బ్రాంచీలు
విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

సవరణ

ఎంపీ షుగర్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో)
23 అక్టోబర్, 2023 పబ్లిక్ ప్రకటన మరియు 10 నవంబర్, 2023న ప్రచురించబడిన సవరణ కు సూచన.

మంగళవారం 5 డిసెంబర్, 2023న మ.3.00 గం. నుండి సా.5.00 గం. వరకు జరిగే ఈ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి వ్యక్తీరణ (ఇఓఐ) సమర్పణకు సమయం పొడిగింపు
23.10.2023న ప్రచురించబడిన ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంకృప్టసీ కోడ్ 2016 క్రింద ఇ-వేలం కొరకు అమ్మకం నోటీసు. ఆసక్తి వ్యక్తీకరణను 6 నవంబర్ 2023 ఆహ్వానించారు, తదనంతరం 10.11.2023న అంబసముద్రం యూనిట్‌తో కూడిన భూమి (సుమారు 202 ఎకరాల విస్తీర్ణం) అమ్మకం కొరకు ఒక సవరణ ప్రచురించబడింది మరియు తమిళనాడులోని తిరునెల్వెల్లి జిల్లా, అంబసముద్రంలోని ముక్కోడల్ గ్రామం వద్ద ఉన్న భవనములతో కంపెనీ/కార్పొరేట్ రుణగ్రహీతను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి చివరి తేది, ఇప్పుడు 30 నవంబర్, 2023 వరకు పొడిగించబడింది. www.psri.in/escl/ వెబ్‌సైట్‌లో వివరించిన విధంగా అర్హత ప్రమాణాలను నెరవేర్చిన దరఖాస్తుదారులు ఇప్పుడు 30 నవంబర్, 2023 లోపు ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించగలరు.
ఇంకా ఇఎమ్‌డి చెల్లింపు చివరి తేది 4 డిసెంబర్, 2023 వరకు పొడిగించబడింది. ఇ-వేలం తేది 24 నవంబర్, 2023 నుండి 5 డిసెంబర్, 2023, మ.3.00 గం. నుండి సా.5.00 గం. మధ్య పొడిగించబడింది. మీరు అవసరాల కొరకు ఇ మెయిల్ ip.empee@gmail.com/ plan@psri.in లేదా కాల్ చేయవచ్చును. సంప్రదించాల్సిన నం.: +91 9845002523. ఇ-వేలం తేది 5 డిసెంబర్, 2023 మ.3.00 గం. నుండి సా.5.00 గం. మధ్య జరుగుతుంది.
ఇఓఐ సమర్పణ కొరకు సమయం పొడిగింపు వివరాలు www.psri.in/escl/ లో ఉన్నాయి.

పంకజ్ శ్రీవాస్తవ
లిక్విడేటర్-ఎంపీ షుగర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్
కార్యాలయం నం.58, 3వ క్రాస్, వినాయక నగర్, హెబ్బల్, బెంగళూరు-560024
Regn No: IBBI/IPA-001/IP-P00245 /2017-18/10474
ఎఎఫ్ఎ: 23.11.2023 వరకు చెల్లుతుంది

తేది : మంగళవారం, 22 నవంబర్, 2023
ప్రదేశం : బెంగళూరు

Ph 080 2390 2344| ip.empee@gmail.com | psri@live.com | www.psri.in/escl/

8 నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

తమ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ ఎనిమిది నుంచి అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి తెలిపారు. కాకినాడలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ, ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టిఎ బిల్లులు తక్షణం చెల్లించాలని, ఆయాల ప్రమోషన్ల వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచాలని, ఇందులో రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలని, ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను రద్దు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్‌వాడీలకు సంబంధించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, బీమా అమలు చేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ సంక్షేమ పథకాలను దూరం చేయడం దారుణమన్నారు. జీతాల చెల్లింపుల్లో మాత్రం ప్రభుత్వానికి సంబంధం లేదంటూ రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తుండడం తగదన్నారు. నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం మానేసి, విజిట్ల పేరుతో ఫుడ్ కమిషనర్, అధికారులు అంగన్‌వాడీలను వేధిస్తున్నారని విమర్శించారు. 2017 నుంచి టిఎ బిల్లులు చెల్లించకపోతే ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. సమస్యలపై వివిధ రూపాల్లో నిరసన తెలిపినా స్పందన లేకపోవడంతో రాజ్యాంగం కల్పించిన పోరాడే హక్కు ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ పోరాటానికి ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, చంద్రావతి, ఉపాధ్యక్షులు బాలం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-చుండూరు (బాపట్ల జిల్లా)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్ల జిల్లా చుండూరు మండలంలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన లింగినేని కల్యాణ్ (68) సుమారు 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో సుమారు రూ.10 లక్షలకుపైగా అప్పులయ్యాయి. తనకున్న ఎకరంన్నర పొలాన్ని అమ్మి కొంత బాకీలు తీర్చారు. వ్యవసాయంపై మక్కువతో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కౌలు వ్యవసాయంలోనూ నష్టపోయారు. దీంతో అప్పటికే ఉన్న బాకీలతో కలిపి సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు మిగిలాయి. వీటిని తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపంతో పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

'ఓటు హక్కు'పై మీడియా అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచురితమైన వార్తా కథనాలకు అవార్డులు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఈ విషయం తెలిపారు. 'ఓటర్లలో చైతన్యం, అవగాహన -2023'పేరిట మీడియా సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా (టెలివిజన్, రేడియో) ఆన్‌లైన్ (ఇంటర్నెట్) సోషల్ మీడియా రంగాల్లో ఓటర్లలో చైతన్యం, అవగాహన పెంపొందించేందుకు కృషి చేసిన వారికి రంగానికి ఒక అవార్డు వంతున 2012 నుంచి ఈ విధంగా అవార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. 2023కు సంబంధించి వచ్చే ఏడాది జనవరి 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున ఈ అవార్డులను ప్రధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అవార్డు కింద నగదు పురస్కారంతో పాటు జ్ఞాపిక ప్రదానం చేయనున్నారని సిఇఒ తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియలో ఓటర్లను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసేందుకు వారిలో ఓటుహక్కు వినియోగంపై చైతన్యం కలిగించడం, ఓటరుగా నమోదు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఐటి అప్లికేషన్లు, యూనిక్, రిమోట్ పోలింగ్ కేంద్రాలు వంటి వాటిపై ప్రత్యేక కథనాలు ప్రచురణ, ప్రసారం చేయడం ద్వారా ఓటరుకు అవగాహనకు విశేష కృషిచేసిన మీడియా సంస్థలకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ అవార్డులను ప్రదానం చేయనుందని సిఇఒ ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. ఓటర్ల చైతన్యం, అవగాహనపై నేషనల్ మీడియా అవార్డు-2023కు ఎంట్రీలు పంపేవారు ఆంగ్లం, హిందీ మినహా మిగతా భాషలకు సంబంధించినవి ఇంగ్లీషులో ట్రాన్స్‌లేషన్‌తో కలిపి పంపాల్సి ఉంటుందన్నారు. ఎంట్రీలు డిసెంబరు 10లోగా రాజేశ్‌కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్స్) ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోకారోడ్డు, న్యూఢిల్లీ-110001కు పంపాలని పేర్కొన్నారు. ఇ మెయిల్: media-division@eco.gov.in. ఫోన్ నెంబరు 011-23052131కు సంప్రదించవచ్చని తెలిపారు.

శిలాఫలకం వద్ద విజయసాయి రెడ్డి, విసి తదితరులు

తిరుమల కల్యాణ కట్టలో కెఒడి విధానం రద్దు : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల కల్యాణకట్టలో కెఒడి (కెప్ట్ ఆన్ డ్యూటీ) విధానాన్ని రద్దు చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి ప్రకటించారు. తిరుమల కల్యాణకట్ట క్షురకులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి నేతృత్వంలో మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని కరుణాకర్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిశారు. కెఒడి విధానంలో వేధిస్తూ క్షురకులను అకారణంగా తొలడించడాన్ని వివరించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుమల కల్యాణకట్టలో ఎన్నో ఏళ్లుగా కెఒడి పేరుతో క్షురకులను వేధింపులకు గురి చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, తక్షణం ఈ విధానాన్ని రద్దు చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న పోస్టులలో 114 జిఒ ప్రకారం అర్హులైన క్షురకులను రెగ్యులర్ చేయడానికి తమ బోర్డు కట్టుబడి ఉందని, కటాఫ్ ఇయర్ 2014 కాకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి అదనంగా అవసరమైతే సమయాన్ని పెంచుతామని చెప్పారు. కల్యాణకట్ట డిప్యూటీ ఇఒ సెల్వంకు ఫోన్ చేసి కెఒడి విధానాన్ని రద్దు చేయాలని, తొలగించిన అందరినీ పనుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మేళ్లచెరువు గంగులప్ప, శ్రీవారి కల్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంఘం నేతలు శ్రీహరి, ప్రసాద్ పాల్గొన్నారు.

సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహం

- ఆత్మహత్య అంటున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- సోమల (చిత్తూరు జిల్లా):

విజయలక్ష్మి (ఫైల్)

సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహం చిత్తూరు జిల్లాలో లభ్యమైంది. జిల్లాలోని మండల కేంద్రమైన సోమల సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో పుంగనూరు సిఐ రాఘవరెడ్డి ఘటన స్థలికి వచ్చి పరిశీలించారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు కోటీశ్వరయ్య భార్య విజయలక్ష్మి (52) తొమ్మిది నెలల క్రితం కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మాత్రలు వేసుకుంటున్నా నొప్పి తగ్గట్లేదని బాధపడుతుండేవారు.

ఈ క్రమంలో సోమవారం రాత్రి భర్త, కుమారుడు అఖిల్, విజయలక్ష్మి కలిసి భోజనం చేసి రాత్రి నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం ఇంటిలో విజయలక్ష్మి లేకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతంలో కుటుంబ సభ్యులు గాలించారు. సోమల సమీపంలోని జగనన్న కాలనీ పక్కనున్న జర్నలిస్టులకు కేటాయించిన ఖాళీస్థలంలో సగం కాలిన స్థితిలో మృతదేహం ఉందని స్థానికులు ద్వారా తెలుసుకొని విజయలక్ష్మి భర్త, కుమారుడు అక్కడకు వెళ్లారు. మృతదేహం విజయలక్ష్మిదేనని గుర్తించారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని వారు పోలీసులకు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మహిళది హత్యా, ఆత్మహత్య అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

విశ్వవిద్యాలయాల నుండి నాయకులు తయారవ్వాలి

- ఎంపి విజయసాయి రెడ్డి
- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

విశ్వవిద్యాలయాల నుంచి దేశ భవిష్యత్తు నిర్దేశించే నాయకులు, పాలకులు తయారవ్వాలని రాజ్యసభ సభ్యులు, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ వి విజయ్‌సాయిరెడ్డి అన్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ - మిషన్ లెర్నింగ్- ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఎంపి నిధుల నుండి రూ. 50 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా వర్సిటీలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. భారతదేశం ప్రపంచ దేశాల కంటే ముందుగానే నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలను నెలకొల్పిందని, వాటిల్లో విదేశీ విద్యార్థులు విద్యను అభ్యసించారని పేర్కొన్నారు. ప్రస్తుతం మనదేశ విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకుంటున్నారని, ఈ విధానం చాలా దురదృష్టకరమని అన్నారు. దేశంలోని విద్యావేత్తలు, రాజకీయ నాయకులు, అధికారులు, అధ్యాపకులు కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా విద్యావ్యవస్థలో ప్రమాణాలను మెరుగుపరచుకొని రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటనలో భాగంగా తాను కేరళలోని త్రివేండ్రం సందర్శించానని, అక్కడ గోపీనాథ్ అనే మ్యూజిషియన్ గొప్ప ఆలోచనలతో వికలాంగుల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఎంతో ఆలోచన, దూర దృష్టితో వికలాంగులకు మేలు చేసే విధంగా ఏర్పాటు చేసిన అటువంటి కేంద్రాన్ని నాగార్జున విశ్వవిద్యాలయంలో కూడా ఏర్పాటు చేయాలని, అవసరమైన నిధులను తాను అందజేయడంతోపాటు ఇతరుల నుండి సేకరించే బాధ్యత కూడా తాను స్వీకరిస్తానని చెప్పారు. వర్సిటీ వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. పార్లమెంటు సభ్యులు విజయసాయిరెడ్డి గొప్ప మనసుతో రూ.50 లక్షలు అందజేశారని ధన్యవాదాలు తెలిపారు.

FORM-1
ELECTION NOTICE / NOTIFICATION
(RULE 22(2) (b) (VI) of the APCS Rules 1964

(1) Name and Address of the Society	:	The Guntur District Tobacco Growers & Curers Cooperative Marketing Society Ltd.,No. N1192, Ongole, Prakasam District,
(2) Mode of Election	:	Secret Ballot
(3) Total No. of seats to be filled	:	13 (ThirteenOnly)
(4) Place, Time and date of Poll	:	Place: Office of the Society at Ongole. Time: 7.00 A.M to 2.00 P.M, Date 07-12-2023
(5) Date of Receipt of Nomination	:	Date:30-11-2023
(6) Date of Scrutiny	:	Date: 01-12-2023
(7) Date of Withdrawal of Nominations	:	Date: 02-12-2023
(8) Date of Co-option of MC Members (If necessary) and election of office bearers among the Managing Committee Members	:	Date: 07-12-2023

Dated : 22-11-2023
Place : Ongole.

Sd/-(SHAIK SARWAR SAHEB), Election Officer
The Guntur Dt. Tobacco Growers & Curers Co-op. Marketing Society Ltd., Ongole.

సంపాదకీయం

అదానీ సేవలో...

రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల సముద్ర తీరంలోని అత్యంత విలువైన బీచ్‌శాండ్ మైనింగ్‌ను అదానీ సంస్థలకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నించడం దారుణం. టైటానియమ్ డై ఆక్సైడ్, ఇల్మినైట్, రూటైల్, గార్నెట్, సిలిమనైట్, లూకోజిన్ వంటి అరుదైన మూలకాలు బీచ్‌శాండ్‌లో ఉంటాయి. అణుధార్మిక స్వభావాన్ని కలిగివుండేవి దేశ భద్రతకు కూడా కీలకమైనవి. ఆ కారణంగానే ఆఫ్‌షోర్ మినరల్ మైనింగ్‌లో ప్రైవేటు రంగాన్ని నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో చట్ట సవరణ చేసింది. కాని, అదే మోడీ సర్కారు నాలుగేళ్ల తిరగ్గానే యూ టర్న్ తీసుకుని ఆ మైనింగ్‌కు ప్రైవేటు రంగాన్ని అనుమతించాలంటూ ఈ ఏడాది మే 25న ముసాయిదా విడుదల చేయడం, చకచకా చట్ట సవరణకు బిల్లు ప్రతిపాదించడం వెనుక కార్పొరేట్ల సేవ తప్ప వేరే ప్రయోజనమేదీ కనిపించదు. ప్రతిపక్ష సభ్యులంతా మణిపూర్ దారుణాలపై చర్చ జరగాలని పట్టుబడుతున్న సమయంలో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడం కేంద్ర ప్రభుత్వ 'కార్పొరేట్ సేవా తత్పరత'కు నిదర్శనం.

కార్పొరేట్లు అందునా అదానీ ఆదేశాలకు కేంద్రం ఎంతలా శిరసావహిస్తోందో అర్థం చేసుకోవడానికి ఈ చట్ట సవరణ తతంగం ఓ మచ్చు తునక. బీచ్‌శాండ్ మైనింగ్ కోసం రెండు సంస్థలను (ఒకటి ఎ.పి లో, మరొకటి ఒడిషాలో) ఏర్పాటు చేస్తున్నట్లు గత ఏడాది ఏప్రిల్ 14, 27 తేదీల్లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి అదానీ గ్రూపు లేఖ రాసిన నెల రోజులకు కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ ముసాయిదా విడుదల చేయడం గమనార్హం. అంతేగాక బీచ్‌శాండ్ నిర్వచనాన్ని మార్చడం ద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ ఖనిజాలను 'అణు మూలకాల' జాబితా నుండి తొలగించడానికి కసరత్తు చేస్తోంది. ఆఫ్‌షోర్ మైనింగ్ పరిధిలోకి 12 రకాల ఖనిజాలను తీసుకురావడంతో పాటు గతంలో ఉన్న నాలుగేళ్ల గడువును 50 సంవత్సరాలకు పెంచి లీజుకు ఇవ్వడానికి కేంద్రం ప్రతిపాదించడం కార్పొరేట్లకు సాష్టాంగ పడడమే! మైన్స్ అండ్ మినరల్స్ చట్టం ఖనిజాలను ఎ.బి.సి అనే మూడు రకాలుగా విభజిస్తోంది. పార్ట్ బి లో ఆటమిక్ మినరల్స్ ఉంటాయి. తాజాగా మోడీ ప్రభుత్వం పార్ట్ బి నుండి కొన్ని ఖనిజాలతో డి గ్రూపును ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. 'క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్స్' పేరిట ఏర్పాటు చేయనున్న ఈ గ్రూపులో మొత్తం ఎనిమిది ఖనిజాలూ అదానీ గ్రూపు ఆసక్తి చూపినవే కావడం మరో నిదర్శనం. ఆఫ్‌షోర్ మైనింగ్ చట్ట సవరణలు రాష్ట్రాల హక్కులను తీవ్రంగా దెబ్బ తీస్తాయి. దేశ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించే ఇటువంటి బిల్లులను వ్యతిరేకించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. గతంలో మన రాష్ట్రానికి అటువంటి గొప్ప చరిత్ర ఉంది. కాని, వైసిపి ఆ బిల్లుకు మద్దతు తెలపడం, టిడిపి కూడా అదేబాటన వెళ్లడం మన రాష్ట్ర ప్రయోజనాలకు హానికరం.

సాధారణ పారిశ్రామికవేత్తలు కలిస్తేనే రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ వచ్చేస్తోందన్నట్టు ప్రకటనలు జారీ చేసే సిఎం కార్యాలయం...ఇటీవల గౌతమ్ అదానీ ముఖ్యమంత్రితో భేటీ అయిన సంగతి మాట మాత్రంగానైనా వెల్లడించకపోవడంపై అప్పుడే పలు అనుమానాలు వ్యక్తమైనాయి. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్రంలోని బీచ్ శాండ్ మైన్స్‌లో 'ప్రాజెక్టు డెవలపర్ కమ్ ఆపరేటర్' పేరిట 92 శాతం వాటాను ఆఫర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెండర్లు పిలిచారన్న ఆరోపణలు సత్యదూరం కాదు. ఇప్పటికే రాష్ట్రంలోని కృష్ణపట్నం, గంగవరం పోర్టులు అదానీ పరమైనాయి. విశాఖ నగరంలో విలువైన స్థలాలు ఐటి అభివృద్ధి పేరిట అప్పగించారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ అంటూ రాయలసీమ జిల్లాల్లోను, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి వేల ఎకరాలు కట్టబెడుతున్నారు. బీచ్ శాండ్ మైనింగ్ కూడా తోడైతే బంగాళాఖాతం తీరం నుండి తూర్పు కనుమల వరకు రాష్ట్రంలో అన్నిటా అదానీ సామ్రాజ్యం మరింతగా విస్తరిస్తుంది. అదానీ సేవలో తరించిపోతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలను జనం ప్రతిఘటించాలి. ప్రజల సంపదను ప్రజలే కాపాడుకోవాలి. అందుకు సమైక్య, సంఘటిత ఉద్యమాలు, పోరాటాలు సాగాలి.

మహోన్నతుల మాట

ప్రతి దేశంలోనూ కార్మిక వర్గం తన పోరాటాల ద్వారానే పోరాడటం గురించి నేర్చుకుంటుంది.

- రోజా లగ్జెంబర్గ్

విశ్లేషణ

రాష్ట్రంలో ప్రజా పక్షం కావాలి

ప్రజా ప్రణాళికతో మరో అడుగు ముందుకు

ప్రజారక్షణ భేరి సందర్భంగా జరిగిన రాజకీయ క్యాంపెయిన్ సిపియం విశిష్టతను చాటిచెప్పింది. నాలుగు అంశాలతో కూడిన రాజకీయ విధానం చుట్టూ పార్టీని ఐక్యం చేయగలిగింది. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని ఒంటరిపాటు చేయడం, ఓడించడం ప్రధాన కర్తవ్యం కాగా, ఆ బిజెపికి వంత పాడుతున్న పార్టీలపై ఒత్తిడి తేవడం, వారి అవకాశవాద విధానాలు ప్రజల్లోకి తీసుకుపోవడంలో చాలా వరకు కృతకృత్యులమయ్యాం. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్బంధ విధానాలపై సిపియం రాజీలేని పోరు సాగించింది. వివిధ వర్గాలు, తరగతులు చేస్తున్న పోరాటాలకు ప్రజారక్షణభేరి మద్దతునిచ్చింది. కరువు, కరెంటు చార్జీల పెంపు, అధిక ధరలు, నిరుద్యోగం, దళితులపై దాడులు, భూపోరాటాలు, పోలవరం నిర్వాసితుల హక్కులు, విశాఖ ప్రైవేటీకరణ సమస్యలపై ప్రజలు వివిధ రూపాల్లో కదులుతున్నారు. కనీస వేతనాల కోసం మున్సిపల్ వర్కర్లు, అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు. వాటిపై సమరశీల పోరాటాలు సాగుతున్నాయి.

రెండు నెలలపాటు జరిగిన ప్రజారక్షణ భేరి రాష్ట్రవ్యాపిత క్యాంపెయిన్ 15వ తేదీ ప్రదర్శన, సభతో జయప్రదమైంది. ఈ క్యాంపెయిన్ అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. పార్టీలో విశ్వాసాన్ని నింపింది. ప్రజా ఉద్యమాలు మరో అడుగు ముందుకు వేయడానికి పురికొల్పింది. రాబోయే రోజుల్లో సిపియం పురోగమనానికి ఇది స్ఫూర్తినిస్తుంది. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను ఈ సభ చాటిచెప్పింది.

నాలుగు దశల్లో ప్రణాళికాబద్ధ కృషి

రాష్ట్రం ఎదుర్కొంటున్న వివిధ తరహా ప్రజా సమస్యలపై అన్ని జిల్లా కేంద్రాలలో వేర్వేరు అంశాలపై మొదటి దశలో సదస్సులు జరిగాయి. వివిధ జిల్లాల్లో సాగిన పాదయాత్రలు సమగ్రాభివృద్ధి ఆవశ్యకతను ముందుకు తెచ్చాయి. రెండవ దశలో మేధావులను ఆహ్వానించి ముఖ్యమైన అంశాలపై రెండు రోజుల రాష్ట్ర సెమినార్ నిర్వహించాం. ప్రజా ప్రణాళిక రూపకల్పనకు ఇది పునాది వేసింది. ఈ అంశాల ఆధారంగా 31 అంశాలతో మూడు ప్రాంతాల నుండి బస్సు యాత్రలు నడిచాయి. ఈ యాత్రల సందర్భంగా దారిపొడవునా స్థానిక సమస్యలపై వందలాది అర్జీలు అందాయి. ప్రజల సమస్యలు కుప్పలుతెప్పలుగా పెండింగ్‌లో ఉన్నాయన్న వాస్తవాన్ని ఈ అర్జీలు వెలుగులోకి తెచ్చాయి. 1902, జగనన్నకు చెప్పుకుందామన్న కాల్‌సెంటర్ జిమ్మిక్కులేవీ ఈ సమస్యలకు పరిష్కారం చూపలేదు. మోడీ ద్రోహంపై జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపైనా అంతే తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమైంది. నాలుగవ దశలో స్థానిక ప్రచారం, జనసమీకరణకు ఏర్పాట్లు, రెడ్‌షర్ట్ వలంటీర్ల శిక్షణ, కళాబృందాల మద్దతుతో 15వ తేదీ ప్రదర్శన, సభ ఉత్సాహపూరితంగా జరిగింది.

సిపియం రాజకీయ నిబద్ధతకు నిదర్శనం

వి. శ్రీనివాసరావు

ప్రజారక్షణ భేరి సందర్భంగా జరిగిన రాజకీయ క్యాంపెయిన్ సిపియం విశిష్టతను చాటిచెప్పింది. నాలుగు అంశాలతో కూడిన రాజకీయ విధానం చుట్టూ పార్టీని ఐక్యం చేయగలిగింది. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని ఒంటరిపాటు చేయడం, ఓడించడం ప్రధాన కర్తవ్యం కాగా, ఆ బిజెపికి వంత పాడుతున్న పార్టీలపై ఒత్తిడి తేవడం, వారి అవకాశవాద విధానాలు ప్రజల్లోకి తీసుకుపోవడంలో చాలా వరకు కృతకృత్యులమయ్యాం. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్బంధ విధానాలపై సిపియం రాజీలేని పోరు సాగించింది. వివిధ వర్గాలు, తరగతులు చేస్తున్న పోరాటాలకు ప్రజారక్షణభేరి మద్దతునిచ్చింది. కరువు, కరెంటు చార్జీల పెంపు, అధిక ధరలు, నిరుద్యోగం, దళితులపై దాడులు, భూపోరాటాలు, పోలవరం నిర్వాసితుల హక్కులు, విశాఖ ప్రైవేటీకరణ సమస్యలపై ప్రజలు వివిధ రూపాల్లో కదులుతున్నారు. కనీస వేతనాల కోసం మున్సిపల్ వర్కర్లు, అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు. వాటిపై సమరశీల పోరాటాలు సాగుతున్నాయి. అమెరికాతో చేతులు కలిపి ఇజ్రాయిల్ దురాక్రమణకు గురైన పాలస్తీనా ప్రజలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటాం. పాలస్తీనాకు మద్దతు ఇవ్వడమంటే ఉగ్రవాదాన్ని బలపరుస్తున్నట్లు సంఘ్‌పరివారం, బిజెపి చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి. ఇలాంటి బిజెపికి వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి, జనసేన ఎలా మద్దతునిస్తున్నాయో ప్రజలు ప్రశ్నించాలి. ప్రజా సమస్యలపై పోరాడుతూనే పార్టీ స్వతంత్ర రాజకీయ విధానం చుట్టూ ప్రజలను సమీకరించాలి.

అసమానతలు లేని అభివృద్ధి కోసం

రాష్ట్ర విభజనానంతరం ఈ పదేళ్ళలో అన్ని రంగాల్లోనూ రాష్ట్రం వెనుకబాటును ఎదుర్కొంటున్నది. ఆర్థిక అసమానతలు తీవ్రమయ్యాయి. కార్పొరేట్లు అంతర్జాతీయ స్థాయికి ఎదిగినా క్షేత్ర స్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు అడుగంటాయి. ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగాయి. వెనుకబడిన ప్రాంతాలకు ఇస్తామన్న నిధులు ఇవ్వకపోగా, ఇచ్చిన నిధులను కూడా కేంద్రం వెనక్కు తీసుకున్నది. రాష్ట్ర విభజన చట్టాన్ని ధిక్కరించి కృష్ణా జలాల సమీక్షకై కేంద్రం ఇచ్చిన గెజిట్ రాష్ట్రంపై బిజెపి పొడిచిన మరో వెన్నుపోటు. దేశం సూపర్ పవర్ అవుతుందన్న మోడీ మాటల్ని ఏజెన్సీ ప్రాంతం ఎగతాళి చేస్తున్నది. రోడ్లు, నీరు, విద్యా, వైద్యం ఏవీ లేక వివక్షతను ఎదుర్కొంటున్నది. దళితులపై దాడులు, ఇప్పటికీ కొనసాగుతున్న అంటరానితనం, సామాజిక అసమానతలను ఎత్తిచూపుతున్నది. లింగ వివక్షతతో చదువు, వేతనాలు, అత్యాచారాలు అన్నింట్లోనూ ఆడపిల్లలు బలిపశువులవుతున్నారు. సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం యువతకు మద్యం, మాదకద్రవ్యాలు బహుమతిగా అందిస్తున్నది.

ప్రత్యామ్నాయ ప్రణాళిక

అభివృద్ధి పేరుతో అన్ని పార్టీలు కార్పొరేట్లకు పెద్దపీట వేస్తున్నాయి. సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో భూములు, నీరు, మైనింగ్, కరెంట్ అన్నీ కట్టబెడుతున్నారు. బ్యాంకు రుణాలు ఎగ్గొడుతున్నారు. పన్నులు మినహాయింపు ఇస్తున్నారు. బడా కార్పొరేట్ల నుండి ఆ డబ్బులు గుంజి ప్రజలపై భారాలు వేయకుండానే సంక్షేమం, అభివృద్ధిని ముందుకు నడిపించవచ్చు. అప్పులు తగ్గించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో సిపియం ప్రజా ప్రణాళికను రూపొందించి రాష్ట్ర ప్రజల ముందుంచింది. దాని చుట్టూ వివిధ శ్రేణుల్ని సమైక్యపర్చాలి. సంక్షేమం పేరుతో నగదు బదిలీ కార్యక్రమాలను చేపట్టి, అదే పెద్ద విజయమని బాకాలూదుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజారక్షణ భేరి ముందుకు తెచ్చింది. ఈ ప్రణాళిక తక్షణం ఈనాడున్న ఆర్థిక సామాజిక నేపథ్యంలో చిత్తశుద్ధి ఉన్న ఏ ప్రభుత్వమైనా అమలు చేయగలిగిన అంశాలనే ముందుకు తెచ్చింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు తగ్గుతున్నా విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు దొంగ లెక్కలతో లాభాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటున్నాయి. ఆ తప్పుడు లెక్కలతో రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా చార్జీలు పెంచింది. క్రమంగా అది ప్రజలకు అతి పెద్ద భారంగా మారుతున్నది. ఉత్పత్తి ఖర్చులు, క్రాస్ సబ్సిడీని పరిగణలోనికి తీసుకుంటే రూపాయికే యూనిట్ కరెంటు ఇవ్వవచ్చని ప్రజా ప్రణాళిక ముందుకు తెచ్చింది. దీనికితోడు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను జనంపై రుద్దుతున్నది. వ్యవసాయ పంపుసెట్లకు బలవంతంగా మీటర్లు పెట్టింది. ఇప్పుడు ఇళ్ళకూ పెట్టేందుకు సన్నాహం చేస్తున్నారు. అదానీ, షిర్డీ సాయి లాంటి కంపెనీలను ఉద్ధరించడానికి తప్ప ఇవి ప్రజలకు మేలు చేయవు. పైగా భారం వేస్తుంది.

ప్రభుత్వ పన్నులు తగ్గించుకుంటే పెట్రోల్, డీజిల్ లీటర్ 60 రూపాయలకే ఇవ్వొచ్చు. ఇళ్ళ నిర్మాణాలు, మరమ్మతుల పనులకు పెరిగిన ఇసుక ధర శరాఘాతంగా మారింది. ఈ మూడేళ్ళలో మూడు రెట్లు పెరిగింది. ఇసుకపై ప్రభుత్వం నియంత్రణ పెట్టి ఉచితంగా ఇస్తే రవాణా ఖర్చుతో అందరికీ అందుబాటులోకి వస్తుంది. భారీ కట్టడాలకు ప్రత్యేక ధర నిర్ణయించి వసూలు చేయాలి. ధరల పెరుగుదల ముందు సంక్షేమ కార్యక్రమాల ద్వారా చేకూరుతున్న లబ్ధి ఏ మూలకూ సరిపోవడం లేదు. దానికి పన్నుల భారం తోడైంది. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న షరతులు, ప్రపంచబ్యాంకు సంస్కరణలు, వివిధ పద్ధతుల్లో ప్రజలపై భారాలు మోపుతున్నాయి. సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ఒకదానికొకటి పోటీ కావు. పరస్పర సహాయకాలు. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల ఆదాయం పెరిగితే కొనుగోలు శక్తి పెరుగుతుంది. అది పారిశ్రామికాభివృద్ధికి దారితీస్తుంది. తద్వారా ఉపాధి విస్తరిస్తుంది. ఉద్యోగాలూ పెరుగుతాయి. కానీ ప్రభుత్వ భారాలు, అధిక ధరలు, పన్నుల వల్ల సంక్షేమ నగదు ఎందుకూ కొరగాకుండా పోతున్నది. ప్రజల ఆదాయాలు పెరగడానికి బదులుగా అప్పులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కూడా ప్రజల ఆస్తులు, ఆదాయాలు పెంపుదలకు తోడ్పడే విధానాలు అవలంభించడంలేదు. ఆస్తికి మూలం భూమి, సొంత ఇల్లు. నాలుగేళ్ళ క్రితం పూర్తయిన టిడ్కో ఇళ్ళను ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వలేదు. కానీ తీసుకున్న రుణాలకు బ్యాంకులు నోటీసులిస్తున్నాయి. జగనన్న కాలనీలు ఆధునిక మురికి కూపాలకు మారుపేరుగా నిలుస్తున్నాయి. ఏ సౌకర్యాలూ లేవు. అనేక ఏళ్ళుగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు కట్టుకొని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వడం లేదు. అనేకచోట్ల బలవంతంగా ఖాళీ చేయించి ఆ భూముల్ని సంపన్నులపరం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇలా నవరత్నాల పేరుతో ప్రజలను నిరాస్తిపరుల్ని చేస్తున్నది.

ఈ కాలంలో ప్రజల ఆదాయాలూ పడిపోయాయి. ఆదాయం పెరగాలంటే ఉద్యోగాలు రావాలి. ఉపాధి పెరగాలి. కానీ భూపంపకం గురించి, కనీస వేతనాల గురించి వామపక్షాలు మినహా ఏ పార్టీ మాట్లాడడం లేదు. ప్రజలకు మేలు చేకూర్చే విధానాల గురించి కాకుండా ప్రధానమైన రెండు పార్టీలు ఒకరినొకరు దెబ్బ తీసుకునే అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ యజ్ఞంలో సామాన్య ప్రజలు బలిపశువులవుతున్నారు. అందుకే ప్రజా ప్రణాళిక ద్వారా ప్రత్యామ్నాయ విధానాల ప్రచారానికి సిపియం నాంది పలికింది.

స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజలు

ప్రజా రక్షణ భేరి సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవల కాలంలో విజయవాడలో ఇంత పెద్ద ప్రదర్శన, సభ జరగలేదన్నది జన వాక్యం. ఇతర పార్టీల సభలకు భిన్నంగా జనం స్వచ్ఛందంగా తరలి వచ్చారు. సిపియం కు ప్రజలు, శ్రేయోభిలాషులే వ్యూహకర్తలు. ప్రజలే ఎక్కడికక్కడ నిధి వసూలు చేసుకొని వాహనాలు పెట్టుకున్నారు. ఎవరి భోజనాల ఖర్చు వారే భరించారు (కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ల పాత్ర లేకుండా జరిగిన సభ ఇది.). అనేకమంది ముందుగానే ఆహారం మూటలు కట్టుకొని తెచ్చుకున్నారు. ప్రదర్శన, సభా ప్రాంగణమంతా నిర్వాహకులు మంచినీరు మాత్రమే సరఫరా చేశారు. రాజకీయం వ్యాపారంగా మారిన నేపథ్యంలో ఈ జన సమీకరణ నూతన రాజకీయ సంస్కృతికి నిదర్శనం. ఈ ప్రదర్శనలో ఎర్ర చొక్కా వలంటీర్ల కవాతు అందరినీ ఆకర్షించింది. 25 సంవత్సరాలలోపు యువతీ, యువకులు ఇందులో పాల్గొన్నారు. యువతులు, పిల్లలు సైతం ప్రదర్శించిన క్రమశిక్షణ అబ్బురపరిచింది. పెద్దవారు వయస్సును మరచిపోయి ఊరేగింపులో కదం తొక్కారు. వీరు కేవలం కవాతు కోసమే వచ్చినవారు కాదు. సేవా కార్యక్రమాల్లోనూ ప్రజలకండగా ఉండాలన్న దీక్షతో వచ్చారు. కరోనా కాలంలో ఈ వలంటీర్లే ప్రాణాలకు తెగించి వ్యాధిగ్రస్తులను ఆదుకున్నారు. మృతదేహాలను ఖననం చేశారు. కృష్ణా, గోదావరి వరదల్లో ప్రజలకు అండగా నిలబడ్డారు. రక్తదానం చేయడం, ట్యూషన్లు చెప్పడం వంటి అనేక రకాల సేవా కార్యక్రమాల్లో వీరు భాగస్వామ్యమయ్యారు. ఈ కొత్తతరం రాబోయే కాలానికి ఉద్యమ సారథులవుతారు. ప్రజారక్షణ భేరిలో పాల్గొన్న కళాబృందాలు సాంస్కృతిక వైవిధ్యానికి నిదర్శనం. ఒకే దేశం, ఒకే సంస్కృతి పేరుతో భారతీయ సాంస్కృతిక ఔన్నత్యాన్ని, వైవిధ్యాన్ని దెబ్బతీసి అగ్రవర్ణ హిందూ సంస్కృతిని అందరిపై రుద్దాలనుకునే బిజెపి సంఘపరివార కుట్రలకు ఇది మందు. బిజెపి చేస్తున్న సాంస్కృతిక యుద్ధం దేశాన్ని నిరంకుశ పాలనలోకి నడిపిస్తున్నది. నయా ఫాసిస్టు సంస్కృతి విస్తరిస్తున్న ప్రమాదం కంటికి ఎదురుగా కనిపిస్తున్నది. ఈ స్థితిలో ప్రదర్శన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల, తెగల, తరగతుల, సాంస్కృతిక, కళా విశిష్టతను చాటిచెప్పింది. ఆ రకంగా ఇది కేవలం జన సమీకరణ మాత్రమే కాదు, దాని చుట్టూ దేశరక్షణ, ప్రజా ప్రయోజనాలు అల్లుకొని ఉన్నాయి. సిపియం విశిష్టతను చాటిచెప్పిన ప్రజారక్షణ భేరి క్యాంపెయిన్ జయప్రదం అవ్వడమంటే ప్రజా ఉద్యమాలను మరొక అడుగు ముందుకు నడిపించడమే.

ప్రజాపక్షం కావాలి

రాష్ట్ర రాజకీయాల్లో ప్రజాపక్షం ఆవశ్యకతను ఈ సభ ముందుకు తెచ్చింది. అధికారపక్షం ప్రజలపై భారాలు వేస్తుంటే ప్రతిపక్షం ప్రజా సమస్యలను స్వంత రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నది. దీనికి భిన్నంగా ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా వామపక్షాలు, సిపియం ముందుకు సాగుతాయి. రానున్న కాలంలో ఆ స్ఫూర్తే సిపియం శ్రేణులకు మార్గదర్శకమవుతుంది.

/ వ్యాసకర్త సిపియం రాష్ట్ర కార్యదర్శి /

అంతర్జాతీయం

అర్జెంటీనా అధ్యక్షుడిగా పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకి!

ఎం. కోటేశ్వరరావు

ఆదివారం నాడు జరిగిన అర్జెంటీనా అధ్యక్ష తుది ఎన్నికల్లో పచ్చి మితవాది జేవియర్ మిలై విజయం సాధించాడు. వామపక్షాల మద్దతు ఉన్న అధికార పెరోనిస్టు పార్టీ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి, కూటమి అభ్యర్థి సెర్గియో మాసాకు 44 శాతం ఓట్లు రాగా మిలై 56 శాతం తెచ్చుకున్నాడు. డిసెంబరు పదవ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నాడు. మార్కెట్ అనుకూల మిలై వాగాడంబరా నికి మితవాద శక్తులు, అసంతృప్తి చెందిన యువతరం అధికార కూటమికి వ్యతిరేకంగా ఓటు చేసినట్లు కనిపిస్తోంది.

కరోనా, ఇతర వైఫల్యాల కారణంగా తలెత్తిన పరిస్థితిని ఉపయోగించుకొని జేవియర్ మిలై 2021 పార్లమెంటు ఎన్నికల్లో కొత్త పార్టీతో రంగంలోకి దిగాడు. వాస్తవ ప్రతిపాదనలతో ముందుకు వచ్చిన అభ్యర్థిని తాను మాత్రమేనని మిలై చెప్పాడు. అతగాడికి కుక్కలంటే పిచ్చి. వాటి భాషలో మాట్లాడతాడు. ఎన్నికలకు ముందు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణాన్ని తగ్గించటం గురించి ఆలోచిస్తున్నానని, అందుకుగాను తన దగ్గర ఐదు కుక్కలున్నాయని, అవి పది లేదా ఇరవై కూడా కావచ్చు అని చెప్పాడు. వాటిని వదిలితే తగ్గుతుందన్నాడు. మిలై దృష్టిలో కుక్కలంటే రాజ్యాన్ని పక్కన పెట్టి మొత్తం వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించాలని ప్రబోధించే ప్రముఖులు. ఆర్థిక సమస్యలను పరిష్కరించటానికి రాజ్యం ఒక పరిష్కారం కాదు, అదే అసలు సమస్య అని కూడా చెప్పాడు. దేశంలోని మొత్తం రాజకీయ తరగతి అంతా దొంగలని, పన్నులు విధించాలని కోరటం హింసాత్మక చర్య అన్నాడు. ఇతగాడి నోటి దురుసుతనంతో అసంతృప్తితో ఉన్న జనం మద్దతుదారులుగా మారవచ్చు, ఓట్లు వేయవచ్చు, నిజంగా అధికారం వస్తే ఎలా పాలిస్తాడో ఏ తిప్పలు తెచ్చిపెడతాడో అన్న భయాన్ని వెల్లడించిన వారు కూడా లేకపోలేదు. చివరకు అదే నిజమైంది. ప్రాథమిక ఎన్నికల్లోనే అర్జెంటీనాకు పచ్చి మితవాద శక్తుల ముప్పు ముంచుకువస్తున్నట్లు వెల్లడైంది. ఫలితాలు అనేక మందిని దిగ్భ్రాంతికి గురి చేశాయి. కొత్త రాజకీయ చర్చకు తెర తీశాయి. ఆ ఎన్నికల్లో స్వేచ్ఛతో ముందుకు (లిబర్టీ అడ్వాన్సెస్) పార్టీ నేతగా జేవియర్ మిలై అగ్రస్థానంలో నిలిచాడు. అక్టోబరు 22న జరిగిన తొలి దఫా ఎన్నికల్లో ఐదుగురు పోటీ చేశారు. వారిలో పెరోనిస్టు మాసాకు 36.78 శాతం, మిలైకి 29.99 శాతం, మూడో అభ్యర్థికి 23.81 శాతం రాగా మిగిలిన ఇద్దరికీ కలిపి 9.43 శాతం వచ్చాయి. దీంతో నవంబరు 19న తుది దఫా మాసా-మిలై మధ్య పోటీ జరిగింది.

ప్రాథమిక ఎన్నికల్లో మొదటి స్థానంలో ఉన్నట్లు ఫలితాలు వెల్లడి కావటంతో మిలై తన మద్దతుదారులతో సంబరాలు చేసుకున్నాడు. రాజకీయ నేతలు మారకపోతే వారిని వదిలించుకోవాలని పిలుపునిచ్చాడు. ప్రస్తుత అధ్యక్షుడు ఆల్బర్టో ఫెర్నాండెజ్ చైనాను అనుమతించి కొన్ని కీలక రంగాలను అప్పగించాడని ఆరోపించాడు. తాను చైనాతో సంబంధాలను తెంచివేస్తానని, కమ్యూనిస్టులతో వ్యాపారం చేయనని అన్నాడు. కమ్యూనిజం గురించి అవాకులు, చవాకులు పేలాడు. తాను అధికారానికి వచ్చిన తరువాత దేశ రిజర్వుబాంకును రద్దు చేస్తానని, ప్రభుత్వ ఖర్చులో కోత పెడతానని, పతనమౌతున్న దేశ కరెన్సీ పెసోను రద్దు చేసి కొన్ని దేశాల మాదిరి అమెరికా డాలరును చట్టబద్ధమైన కరెన్సీగా ప్రకటిస్తానని చెప్పాడు. అర్జెంటీనా ఎన్నికలు ఒక్క లాటిన్ అమెరికాకే కాదు, మొత్తం ప్రపంచానికే ఆసక్తికరంగా మారాయని చెప్పవచ్చు.

లాటిన్ అమెరికాను అమెరికా సామ్రాజ్యవాదం తన పెరటి తోటగా పరిగణించింది. తనకు లోబడిన వారిని గద్దె నెక్కించటం వీలుగాకపోతే మిలిటరీ నియంతలను రంగంలోకి తెచ్చింది. ఇదే సమయంలో ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ విధానాలను ఆ దేశాల మీద రుద్దారు. అవి వికటించటం, అనేక దేశాల్లో నియంతలు, మితవాద పాలకులకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు పార్లమెంటరీ పోరాటంతో పాటు ఆయుధాలు కూడా పట్టి జనాన్ని సమీకరించారు. దివాళాకోరు ఆర్థిక విధానాలతో పాలకులు ప్రజల నుంచి దూరం కావటం, ప్రతిఘటన తీవ్రమైన తరుణంలో విధిలేక ఎన్నికలు జరపటం వాటిలో నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అనేక మంది ఒక్కటిగా నిలవటంతో వామపక్ష శక్తులు అధికారానికి వచ్చాయి. ప్రజలకు మేలు చేయాలనే వైఖరిని బలపరిచారు. దోపిడీ వ్యవస్థ పునాదులను కూలిస్తే తప్ప జన జీవితాల్లో మౌలిక మార్పులు రావనే అంశాన్ని గుర్తించటంలో, అమలు జరపటంలో ఏకాభిప్రాయం లేదు. అందువల్లనే అధికారానికి వచ్చినచోట వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు గత పునాదుల మీదనే సామాన్య జనానికి ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవటంతో వరుసగా రెండు, మూడు సార్లు గెలుస్తూ వచ్చారు. అయితే వాటికి ఉన్న పరిమితులు వెల్లడి కావటంతో జనంలో తలెత్తిన అసంతృప్తి కారణంగా తిరిగి మితవాద శక్తులు తలెత్తుతున్నాయి.

గతంలో మాదిరి నియంతలను రుద్దితే లాభం లేదని గుర్తించిన అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను దెబ్బతీసేందుకు మితవాద శక్తులకు మద్దతు ఇస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచినప్పటికీ పెట్టుబడిదారీ, కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా అసంతృప్తి తలెత్తి తిరిగి జనం వామపక్షాలకు పట్టంగడుతున్నారు. బ్రెజిల్‌లో లూలా అదే విధంగా మరోసారి గెలిచాడు. అర్జెంటీనాలో గత ఎన్నికల్లో జరిగింది అదే. ప్రజాతంత్ర, వామపక్ష శక్తులు మౌలిక విధానాల మార్పుల జోలికి పోని కారణంగా జన జీవితాల్లో పెద్ద మార్పులు రాలేదు. అర్జెంటీనాలో ప్రస్తుతం 45 శాతం జనం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. వార్షిక ద్రవ్యోల్బణం 143 శాతానికి చేరింది. ప్రభుత్వం వద్ద నగదు నిల్వలు లేవు. దశాబ్ది కాలంగా జిడిపి ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది. కరెన్సీ విలువ పతనమైంది. అప్పుల మీదనే దేశం నడుస్తోంది. ఈ కారణంగానే మితవాద ఆర్థికవేత్త కూడా అయిన మిలై చేసిన సైద్ధాంతికపరమైన దాడికి నూతన తరం ఆకర్షితమైనట్లు కనిపిస్తోంది. ఇప్పుడున్న వాటన్నింటినీ రద్దు చేసి మొత్తం బాధ్యత అంతటినీ మార్కెట్ శక్తులకు వదిలి వేస్తే అవే సమస్యలను పరిష్కరిస్తాయంటూ అరచేతిలో స్వర్గం చూపుతున్నాడు. ఏ ప్రభుత్వమైతే పెద్ద ఎత్తున సబ్సిడీలు, నగదు బదిలీ చేసిందో ఆ లబ్ధి పొందిన పేదలు కూడా దానికి వ్యతిరేకంగా మితవాద మిలైకి ఓటు వేసినట్లు స్పష్టమైంది. మితవాద మిలై విప్లవాత్మక మార్పులను నిజంగా తెస్తాడని, మరొక మార్గం లేదని జనం భ్రమలకు గురైనట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

నయా ఉదారవాద విధానాలకు శస్త్ర చికిత్స తప్ప పై పూతలతో దాన్ని సంస్కరించి ప్రజానుకూలంగా మార్చలేర న్నది గ్రహించాల్సి ఉంది. జనంలో ఉన్న అసంతృప్తిని సొమ్ము చేసుకొని గద్దెనెక్కినప్పటికీ జేవియర్ మిలై తాను ప్రకటించిన అరాచక పెట్టుబడిదారీ విధానాలను అమలు జరపటం అంత తేలిక కాదు. 2021లో జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాల తరువాత 257 స్థానాలకు గాను పెరోనిస్టు కూటమికి 118, వర్కర్స్ లెఫ్ట్ ఫ్రంట్‌కు నాలుగు మినహా మిగిలిన సీట్లన్నింటిలో మితవాద పార్టీల కూటమికి 116, ఇతర మితవాద పార్టీలు, స్వతంత్రులు కలిపితే మెజారిటీ ఉన్నారు. అనేక దేశాల్లో అధికారానికి వచ్చిన మితవాదులు తొలుత తమ దాడిని కార్మికుల మీదనే ప్రారంభించిన నేపథ్యంలో మిలై ఆచరణ కూడా దానికి భిన్నంగా ఉంటుందని భావించలేము. అదే జరిగితే వెంటనే ప్రజా ప్రతిఘటన కూడా ప్రారంభం అవుతుంది. ★

కవిత్వం

ఓటంటే..!

ఓటంటే
నీ జేబులో నోటు కాదు
ప్రజాస్వామ్యాన్ని
పరిరక్షించే కోటు.
ఓటంటే
సారా చుక్క కాదు
రాజ్యాంగ విలువలను
కాపాడే సిరా చుక్క.
ఓటంటే
నీవు తిరిగే బెంజి కాదు
పేదోడికి దొరికే
మూడు పూట్ల గంజి.
ఓటంటే
నీవు కూర్చునే సీటు కాదు
గూడులేని వారికి
నీవిచ్చే ప్లాటు.
ఓటంటే
నీవు తాగే ఖరీదైన బీరు కాదు
సాగు భూమికి
నీవు ఇచ్చే నీరు.
ఓటంటే
నీవు పవళించే పరుపు కాదు
రహదారి భద్రతకు
నీవు వేసే రోడ్డు.
ఓటంటే
నీవు వృద్ధి కావడం కాదు
బడుగు జీవితాలను
నీవు చేసే అభివృద్ధి.
ఓటంటే
నీవు ఇచ్చే తాయిలాలు కాదు
కనీస అవసరాలకు
నీవు ఇచ్చే సౌకర్యాలు.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
Celebrating 100 Years of Trust

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, 1వ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజి చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే ది.22.02.2019 తేదీన నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే ''ఎక్కడ ఉన్నది అక్కడే'' ''ఉన్నది ఉన్నట్లే'' మరియు ''యదాతథం'' ప్రాతిపదికపై తేది.19.12.2023 అమ్మకానికి తెలిపిన తేదీన విక్రయించబడునని ఋణగ్రహీతలు / హామీదారులు / సహపూచీదారులు: (1) మెస్సర్స్ వెంకటసాయి కాటన్ ట్రేడర్స్ తరపున యజమాని: శ్రీ వినాయకరావు గోలి, చిరునామా: డోర్ నెం.02-199, ఆంజనేయస్వామి టెంపుల్ దగ్గర, ఏటుకూరు గ్రామము మరియు పోస్ట్, గుంటూరు-522017, ఆంధ్రప్రదేశ్. మరియు ఇక్కడ కూడా: మెస్సర్స్ వెంకటసాయి కాటన్ ట్రేడర్స్ C/o. మెస్సర్స్ శ్రీనివాస జిన్నింగ్ మిల్, డోర్ నెం.10/జి, ఏటుకూరు బైపాస్‌రోడ్డు, గుంటూరు-522003. (2) శ్రీ వినాయకరావు గోలి, తండ్రి: శ్రీ వెంకట కృష్ణయ్య గోలి, (3) శ్రీమతి వెంకాయమ్మ గోలి, భర్త: వినాయకరావు గోలి, నెం.(2) & (3) చిరునామా: డి.నెం.2-199, ఆంజనేయస్వామి టెంపుల్ దగ్గర, ఏటుకూరు గ్రామము మరియు పోస్ట్, గుంటూరు-522017 నుంచి రుణదాత కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి (ఫోన్: 0863-2222444 (G), 9985202444 (BM), 9676444469 (ABM)కు Term Loan A/c 2557001400052901 క్రింద రూ.51,93,463.30 (అక్షరాల యాభై ఒక్క లక్షల తొంభై మూడు వేల నాలుగు వందల అరవై మూడు రూపాయలు మరియు ముప్పై పైసలు మాత్రమే) 01-08-2022 తేదీ నుండి భవిష్యవడ్డీ + వ్యయాలు మొ॥ వాటితో సహా గల మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించ బడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరములు

గుంటూరు జిల్లా, న్యూ గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, ఏటుకూరు గ్రామము, డి.నెం.73/బి, సమీప డి.నెం.5-237 నందు శ్రీమతి వెంకాయమ్మ గోలికి చెందిన 931.77 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలము (రెసిడెన్షియల్ ప్లాట్) నకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: యన్.రామారావు యొక్క ఆస్తి; దక్షిణం: టి.దానారావు యొక్క ఆస్తి; పడమర: డొంక మరియు ఉత్తరం: టి.శివయ్య యొక్క ఆస్తి.

రిజర్వుధర : రూ.21,00,000/- (అక్షరాల ఇరవై ఒక్క లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.2,10,000/- (అక్షరాల రెండు లక్షల పది వేల రూపాయలు మాత్రమే)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు / సహపూచీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి. ఇ-వేలము 19.12.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్‌ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును https://bankauctions.in/ నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 18.12.2023న) ఆన్‌లైన్ ద్వారా M/s.4closure, 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500038, సంప్రదించవలసిన నెం: 040-23736405, Mobile: 8142000062/63/64/66, Email: prakash@bankauctions.in and info@bankauctions.in నుండి పొందవచ్చును.

తేది: 18.11.2023, ప్రదేశం: హైదరాబాద్ సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

ట్రాక్టర్ బోల్తా : ఇద్దరు మృతి



- 27 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- మందస మీదుగా ఒడిశా వెళ్తున్న వాహనానికి ప్రమాదం
- బిజెపి సభకు హాజరయ్యేందుకు వెళ్తున్న బాధితులు

ప్రజాశక్తి - మందస, పలాస (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా మందస మండలం గౌడు గురంటి సమీపం వద్ద మంగళవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కుసుమాలకు చెందిన గిరిజనులు బుయ జగన్నాథ్ (50), అబుతొడికి చెందిన సవర డేరా (60) అక్కడికక్కడే మృతి చెందారు. 27 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశా, ఆంధ్రా పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, క్షతగాత్రులు తెలిపిన వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చీకటికోటలో నిర్వహించే బిజెపి బహిరంగ సభకు అదే జిల్లా గుడ్డిభద్రకు చెందిన బిజెపి నాయకుడు సవర కుడుము... కుసుమాల, డబాతోలి, గుడ్డిపాదర్, వ(త`సా౦౦౦, వంబాడియా గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 30 మంది మహిళలు, పురుషులను ట్రాక్టర్‌లో తీసుకెళ్లాడు. మందస మండలం మీదుగా చీకటికోటకు వెళ్లాల్సి ఉండగా, గౌడు గురంటి గెడ్డ సమీపానికి వచ్చేసరికి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సవర డేరా, బుయ జగన్నాథ్ అక్కడికక్కడే మతి చెందారు. 27 మందికి గాయాలయ్యాయి. ఘటనా సమాచారం తెలుసుకున్న మందస పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రులను 108లో మందస మండలం హరిపురం సిహెచ్‌సికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

కుటుంబసభ్యుల కన్నీరుమున్నీరు

ప్రమాద సమాచారం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో తాము ఎలా బతికేదంటూ రోదిస్తున్నారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఒడిశా రాష్ట్రం జరడా పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ సాసుమాను హరిపురం సిహెచ్‌సికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు మందస ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-కాకినాడరూరల్

మౌనిక(ఫైల్ ఫొటో)

ఇంటర్ విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడలో మంగళవారం చోటుచేసుకుంది. పాల్పడ్డారు. పోలీసులు, కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాల మేరకు... కాకినాడకు చెందిన దువ్వల మౌనిక (16) ఆశ్రమ పబ్లిక్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం యథావిధిగా తరగతులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన సమయంలో మౌనిక వాష్‌రూమ్‌కి వెళ్తానని లెక్చరర్ వద్ద అనుమతి తీసుకున్నారు. అలా వెళ్లిన ఆమె కళాశాల బిల్డింగ్ 3వ అంతస్తు నుంచి కిందికి దూకేశారు. తీవ్రగాయాలు కావడంతో ఆమెను కళాశాల సిబ్బంది ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మౌనిక చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌డిఐల్లో 24% పతనం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) ఈక్విటీల్లో 24 శాతం పతనమై 20.48 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ మొత్తం కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, టెలికం, ఆటో, ఫార్మా తదితర రంగాల్లోకి వచ్చిందని కేంద్ర ఆర్థిక, వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాలు వెల్లడించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం ఇదే ప్రథమార్థంలో 26.91 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు నమోదయ్యాయి. ఏడాదికేడాదితో పోల్చితే 2023 జనవరి - మార్చి ఎఫ్‌డిఐల్లో 40.55 శాతం క్షీణించి 9.28 బిలియన్ డాలర్లుగా, జూన్ త్రైమాసికంలో 34 శాతం క్షీణించి 10.94 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. జులై, ఆగస్టులోనూ ఎఫ్‌డిఐ రాకలో పతనం చోటు చేసుకోగా.. సెప్టెంబర్‌లో మాత్రం 4.08 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2022 ఇదే సెప్టెంబర్‌లో 2.97 బిలియన్ల ఎఫ్‌డిఐలు వచ్చాయి. గడిచిన ప్రథమార్థంలో సింగపూర్, మారిషస్, అమెరికా, బ్రిటన్, యుఎఇల నుంచి వచ్చే ఎఫ్‌డిఐల్లో అధికంగా తగ్గుదల చోటు చేసుకుంది. నెథర్లాండ్, జపాన్, జర్మనీ నుంచి వచ్చే ఎఫ్‌డిఐల్లో పెరుగుదల ఉంది. వచ్చిన పెట్టుబడుల్లో ఎక్కువగా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఆకర్షించాయి

BEFORE THE HONOURABLE DEBT RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
O.A. No. 840/2023

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
Union Bank of India, Siris Branch, Vijayawada.
Vs
M/s. SS Traders and anothers

To,
1. **M/s. SS Traders, Prop. SK Nazeer Hussain,** D.No. 74-3-1, Pandaripuram, Vijayawada - 7.
2. **SK Nazeer Hussain, Prop. SK Nazeer Hussain,** D.No. 74-3-1, Pandaripuram, Vijayawada - 7.
3. **Abdul Jabbar, Prop. SK Nazeer Hussain,** D.No. 74-3-1, Pandaripuram, Vijayawada - 7.
4. **Saheena Begum,** D.No. 74-3-1, Pandaripuram, Vijayawada - 7.

SUMMONS TO DEFENDANTS BY WAY OF PAPER PUBLICATION

Whereas, OA/840/2023 was listed before Hon'ble Presiding Officer / Registrar 25/10/2023

Whereas this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under section 19 (4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 1,08,69,698.10/-** (application along with copies of documents etc., annexed) In accordance with sub-section (4) of section 19 of the Act. you, the defendants are directed as under :-

1. To show case within thirty days of the service of summons as to why relief prayed for should not be granted :
2. To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original applications :
3. You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment properties.
4. You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
5. You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course, of business and deposit such sale proceeds in the account, maintained with the bank or financial institutions holding security interest over such assets.
M/S. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

Home First Finance Company India Limited,
CIN:- L65990MH2010PLC240703
Website: homefirstindia.com
Phone No.: 18003008425
Email ID: loanfirst@homefirstindia.com

స్వాధీనతా ప్రకటన

రెఫరెన్స్: ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 లోని రూల్ 8 యొక్క సబ్-రూల్ (1) క్రింద స్వాధీనతా ప్రకటన

ఏదైతే క్రింది సంతకందారు హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (చట్టం నెం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇచ్చినట్లుగా దీని సంబంధిత తేదీలపై జారీచేసిన డిమాండ్ నోటీసు అనుసరించి, సదరు నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజుల్లో బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా మిమ్మల్ని/ రుణగ్రహీతలను కోరబడుచున్నది. మీరు/ రుణగ్రహీతలందరూ, నిర్ణీత సమయంలోగా సదరు బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినందున, SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నియమాల క్రింద దాని రూల్స్‌తో చదువబడే హక్కులను సంక్రమించిన అధికారాలను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** కలిగియుంది మరియు వినియోగిస్తుంది. దిగువ పేర్కొన్నట్లు సెక్యూర్డ్ అసెట్స్‌ను **స్వాధీనం** చేసుకుంది.

క్ర. సం.	రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు	తనఖాపెట్టిన యొక్క ఆస్తి వివరణ	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి పూర్తి బకాయి మొత్తం (రూ.లో)	స్వాధీనతా తేది
1.	రాజగోపాలం శ్రీనివాసన్, అమ్మల్ జానకీ శ్రీనివాసన్	వరుస ఇంటి నెం.190/2, (డోర్ నెం.8-31 దగ్గర), గుంటుపల్లి గ్రామం, పంచాయతీ, ఎస్ఆర్ఓ ఇబ్రహీంపట్నం, క్రిష్ణ జిల్లా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521241	03-09-2023	14,31,760	16-11-2023

రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, రుణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, పై పేర్కొన్న తేదీన సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు స్వాధీనంలోకి తీసుకున్నారు.
రుణగ్రహీతలు/హామీదారులు మరియు **సాధారణ ప్రజలను** ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, పై పేర్కొన్న ఆస్తులు/ సెక్యూర్డ్ ఆస్తులు లేదా అందులోని ఏదేని భాగంతో లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్‌తో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది పూర్తిగా చెల్లించు వరకు దానిపై తదుపరి వడ్డీతో చెల్లింపుల ప్రాతిపదిక ఆస్తులు/ సెక్యూర్డ్ అసెట్లపై ఎగువ పేర్కొన్న మొత్తాలను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారికి చెల్లించుటకు లోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్ విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించ వలసిందిగా కోరబడుచున్నది.

తేది: 22-11-2023 ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రామచంద్రన్ మృతి

తిరువనంతపురం : సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్ రామచంద్రన్ (71) మంగళవారం కొచ్చిలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో మరణించారు. ఆయనకు భార్య ప్రియదర్శిని, కుమార్తె దీప ఉన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఉన్న రామచంద్రన్ కొల్లం జిల్లా కార్యదర్శిగా, వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) జిల్లా కన్వీనర్‌గా, కేరళ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (సిడ్కో) ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి దశలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్)లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పని చేశారు. 1978లో సిపిఐ కరునాగపల్లి తాలూకా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2000లో కొల్లం జిల్లా పంచాయత్‌కు ఎన్నికై ఆ తర్వాత 2004లో ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 2016లో కరునాగపల్లి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. అయితే 2021 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి సిఆర్ మహేశ్ (కాంగ్రెస్) చేతిలో ఓడిపోయారు. ప్రజాసందర్శనార్థం రామచంద్రన్ భౌతికకాయాన్ని ఛావరా, కరునాగపల్లి మండల కమిటీ కార్యాలయాలకు తరించి నివాళులర్పించిన అనంతరం ఆయన నివాసం వద్దే శనివారం నాడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దుంగార్‌గఢ్ ఎమ్మెల్యేకు ప్రజాదరణ

- సిపిఎం అభ్యర్థికి ఊరురా జన నీరాజనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో దుంగార్‌గఢ్ నియోజకవర్గంలో సిపిఎం తరపున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే గిర్దారిలాల్ మహియాకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. రైతు నేతగా అందరికీ సుపరిచితులైన గిర్దారిలాల్ నిరాడంబర ఎమ్మెల్యేగా మంచి గుర్తింపు పొందారు. ఆయన చేపట్టిన ట్రాక్టర్ల యాత్ర వివిధ ప్రాంతాలు, గ్రామాలు చుట్టుముడుతూ మంగళవారం నాడు ఆయన సొంత గ్రామమైన దుల్చాసర్‌కి చేరుకోగా అక్కడి ప్రజలు పూలవర్షంతో స్వాగతం పలికారు. సర్పంచ్‌తో సహా గ్రామ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 2018లో మహియా 23,896 ఓట్ల మెజారిటీతో గెలిచారు. కాంగ్రెస్‌కు చెందిన మంగళారామ్ రెండో స్థానంలో, బిజెపికి చెందిన తారాచంద్ సరస్వత్ మూడో స్థానంలో నిలిచారు. ఈసారి కూడా వీరే ప్రత్యర్థులు. బిజెపి తిరుగుబాటు నేత ప్రీతి శర్మ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిల్చోవడంతో సారస్వత్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల్లో రైతుల ఐక్య మద్దతు మహియాను భారీ మెజారిటీతో శాసనసభకు తీసుకొచ్చింది. సిపిఎం తొలిసారిగా 2008లో దుంగార్‌గఢ్‌లో పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో మహియాకు 7,646 ఓట్లు వచ్చాయి. 2013లో పోటీ చేయలేదు. గతంలో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్‌కు కూడా ఒకసారి విజయం సాధించారు.

అవినీతి రహిత ఎమ్మెల్యేగా గుర్తింపు

మహియా ప్రజల అభ్యర్థి అని రైతు బికాంచంద్ అన్నారు. 'ఆయన సాత్వికుడు. దుంగార్‌గఢ్‌లో తొలిసారిగా అవినీతి రహిత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదు. పొలంలోని చిన్న కొట్టం(పాక)లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఐదేళ్లపాటు ప్రజల మధ్య పనిచేశారు. మాజీ ఎమ్మెల్యేలంతా గెలిచాక నియోజకవర్గం వైపు వెనుదిరిగి చూడలేదన్నారు' అని బికాంచంద్ అన్నారు.

ప్రజాగొంతు, ఉద్యమకారుడు

ఎమర్జెన్సీ సమయంలో మహియాను జైలులో పెట్టి చిత్రహింసలు పెట్టారు. వేరుశనగ సాగుకు కేంద్రమైన దుంగార్‌గఢ్‌లో రైతుల కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. దుంగార్‌గఢ్ ప్రజలు వ్యవసాయానికి నీటి కోసం గొట్టపు బావులపై మాత్రమే ఆధారపడతారు. 2016-17లో మహియా విద్యుత్ కోసం పెద్ద ఆందోళనకు నాయకత్వం వహించారు. నాటి వసుంధర రాజే ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రయత్నించింది. మహియాపై దాడులు చేయించారు. జైల్లో కూడా పోరాటం కొనసాగింది. ప్రభుత్వం తలొగ్గింది. దుంగార్‌గఢ్‌లో రైతులకు సరిపడా కరెంటు వచ్చింది.

ఐదేళ్ల కృషే గెలిపిస్తుంది : గిర్దారీలాల్

ఐదేళ్ల పాటు దుంగార్‌గఢ్ ఎమ్మెల్యేగా తాను చేసిన కృషే, తనను మళ్లీ గెలిపిస్తుందని గిర్దారీలాల్ మహియా అన్నారు. ప్రజాశక్తి ప్రతినిధితో ఫోన్‌లో ఆయన మాట్లాడారు. నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న దుంగార్‌గఢ్‌కు కాలువ నీటిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గంగానగర్‌లోని ఇందిరా కెనాల్ నుంచి నీటి సరఫరా ప్రాజెక్టు ప్రారంభించామని తెలిపారు. దుంగార్‌గఢ్‌లో ట్రామాకేర్ కేంద్రం ప్రారంభమైందన్నారు. విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, కొత్తగా నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు కొత్త కాలేజీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. డిగ్రీ కళాశాలను పిజి కళాశాలగా అప్‌గ్రేడ్ చేయించినట్లు పేర్కొన్నారు.

కులగణన, 10 లక్షల ఉద్యోగాలు

- రాజస్థాన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు రోజుల ముందు మంగళవారం కాంగ్రెస్ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని, యువతకు 10 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. చిరంజీవి ఆరోగ్య పథకం కింద లబ్దిదారులకు ప్రస్తుతం ఉన్న వార్షిక మొత్తాన్ని రూ. 25 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచుతామని తెలిపింది. చిరు వ్యాపారులకు రూ 5 లక్షల వరకూ వడ్డీ లేని రుణం మంజూరు చేస్తామని ప్రకటించింది. కుల గణన తరువాత మైనారిటీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొంది. పార్టీ కార్యాలయంలో ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, పిసిసి అధ్యక్షులు గోవింద్ సింగ్ దోతస్రా, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్ సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖర్గే, గెహ్లాట్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర సర్వీసుల తరహాలో పంచాయితీ రాజ్ కేడర్‌ను రూపొందించాలని కాంగ్రెస్ కోరుకుంటుందని, పంచాయితీ స్థాయిలో నియామకాల కోసం కొత్త విధానాన్ని తీసుకుని వస్తామని తెలిపారు. రైతులకు రూ 2 లక్షల వరకూ వడ్డీ లేని రుణాన్ని అంద చేస్తామని, కనీస మద్దతు ధర అమలు చేస్తామని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ కింద ఏటా 150 రోజుల ఉపాధి కల్పిస్తామన్నారు. మహిళలకు ఏటా రూ 10 వేల ఆర్థిక సాయం, రూ. 500లకే ఎల్‌పిజి సిలిండర్, పశువుల పెంపకందారుల నుంచి కేజికి రూ 2 చొప్పున పేడ కొనుగోలు, ఒపిఎస్ పునరుద్ధరణ వంటి హామీలు ఇందులో ఉన్నాయి.

చరిత్ర పాఠ్యాంశాలుగా రామాయణ, మహాభారతాలు

- ఎన్‌సిఇఆర్‌టి ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ : విద్య కాషాయీకరణలో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చరిత్రలో పురాణేతిహాసాలను చొప్పించేందుకు సిద్ధమైంది. రామాయణ, మహాభారతాలను చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఎన్‌సిఇఆర్‌టి ఉన్నత స్థాయి కమిటీ ద్వారా సిఫార్సు చేయించింది. చరిత్రలో ఇప్పటివరకు మూడు యుగాలు (ప్రాచీన, మధ్య, ఆధునిక) ఉండగా ఇప్పుడు క్లాసికల్ యుగాన్ని కొత్తగా చేర్చింది. ఆ పేరుతో వేదాలు, రామాయణ, మహాభారతాలను చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చొప్పించే ప్రయత్నం చేస్తోంది.

ప్రొఫెసర్ సిఐ ఇజాక్ నేతృత్వంలోని ఎన్‌సిఇఆర్‌టి సోషల్ సైన్స్ కమిటీ ఈ మార్పులు చేర్పులకు సంబంధించి పలు సిఫారసులు చేసింది.

వేదాలు, ఆయుర్వేదానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను కూడా సిలబస్‌లో భాగంగా ప్రవేశపెట్టాలని కమిటీ సూచించింది. సోషల్ సైన్సెస్‌పై తుది వైఖరి పత్రంలో పేర్కొన్న ఈ సూచనలను రేపు కొత్త ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల్లో చేర్చుతారు.

తాము సిఫార్సు చేసిన మార్పుల గురించి ఇజాక్ మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటివరకు భారత చరిత్రను మూడు భాగాలుగా విభజించి బోధిస్తున్నారు. ఇప్పుడు క్లాసికల్ విభాగం కింద, రామాయణం, మహాభారతం వంటి ఉద్గ్రంథాలను విద్యార్థులు నేర్చుకోవాలని తాము సిఫార్సు చేశామని అన్నారు. రాముడు అంటే ఎవరు, ఆయన ఏం చేశారు అనే వివరాలు విద్యార్థికి తెలుస్తాయని అన్నారు.

అన్ని తరగతి గదుల్లో గోడలపై స్థానిక భాషల్లో రాజ్యాంగం ముందు పీఠిక రాయించాలని కమిటీ సిఫార్సు చేసిందన్నారు. సుభాష్ చంద్రబోస్ వంటి జాతీయ యోధులకూ తగిన స్థానం కల్పించాలని సూచించామన్నారు. భారత యోధులు, వారి పోరాటాలు, విజయాలు వంటి సమాచారం విద్యార్థులకు తెలియాలని, తద్వారా వారు విశ్వాసాన్ని సముపార్జించుకుంటారని ఇజాక్ తెలిపారు.

రైతును విలన్‌గా ఎందుకు ముద్ర వేస్తున్నారు ?

- పంజాబ్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : రైతును ఒక విలన్‌గా ముద్ర వేయడానికి ముందుగా ఆ రైతు బాధలేమిటో కూడా తెలుసుకోవాల్సిన అవసరం వుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి సుధాంశు ధూలియా వ్యాఖ్యానించారు. వరి పొలాలను ఉద్దేశ్యపూర్వకంగానే రైతులు తగలబెడుతున్నారని తద్వారా దేశ రాజధానిలో పెరుగుతున్న కాలుష్యానికి తన వంతుగా కారకుడవుతున్నారని విమర్శలు ఎదురవుతున్న వేళ జడ్జి వ్యాఖ్యలు వెలువడ్డాయి.

'మీరందరూ కలిసి రైతును విలన్‌గా చేస్తున్నారు. అతడు విలన్ కాదు, అలా చేయడానికి అతనికి వుండే కారణాలు అతనికి వుంటాయి. అది ఎందుకు చేస్తున్నాడో మనకు చెప్పగలిగే వ్యక్తి అతనొక్కడే. కానీ అతనిక్కడ లేడు, మీరంటున్న విలన్ మాటలను వినడం లేదు. అతడు ఇక్కడకు రావాలి.' అని జస్టిస్ ధూలియా అన్నారు.

ఆదివారం ఒక్కరోజే పంజాబ్‌లో 748 ఎకరాల వ్యాప్తంగా వరి పొలాలను తగలబెట్టినట్లు అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ కోర్టుకు తెలిపారు. తాము అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని పంజాబ్ ప్రభుత్వం చెబుతోంది, కానీ క్షేత్ర స్థాయిలో అది కనిపించడం లేదని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే రైతులు, కోర్టు ఆదేశాలు వున్నప్పటికీ, కాలుష్య పెంపునకు కారణమవుతున్నప్పటికీ పొలాలను తగలబెట్టే పరిస్థితుల పట్ల బాధ పడాల్సి వుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారు డబ్బు ప్రయోజనాలను ఎందుకు పొందాలని జస్టిస్ కౌల్ ప్రశ్నించారు. అటువంటి రైతులను కనీస మద్దతు ధర పొందేందుకు ఎందుకు అనుమతిస్తున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానంలో ప్రతి పక్షానికి ఒక ప్రతినిధి వున్నారు, రైతులకు మాత్రం లేరు, అలా ఎందుకు జరగాలి, రైతు ప్రతినిధులను కూడా తీసుకురావాలని అన్నారు. విపరీతంగా వరి పండించడం వల్ల పంజాబ్‌లో భూమి నిస్సారంగా మారిందని జస్టిస్ కౌల్ ఆందోళన వ్యక్తం చేశారు.

మిజోరం అభ్యర్థనకు కేంద్రం 'నో'

న్యూఢిల్లీ : మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండ నేపథ్యంలో అక్కడి నుండి వచ్చి తమ రాష్ట్రంలో ఆశ్రయం పొందుతున్న శరణార్థులకు నగదు రూపంలో కానీ, ఇతరత్రా కానీ సాయం అందించాలంటూ మిజోరం అనేక నెలలుగా కేంద్రాన్ని కోరుతూనే ఉంది. అయితే దీనిపై మోడీ ప్రభుత్వం స్పందించడం లేదు. మణిపూర్ నుండి వచ్చిన 12 వేల మంది శరణార్థులు ప్రస్తుతం మిజోరంలో తలదాచుకుంటున్నారు. వీరి కోసం పది కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించాలంటూ మిజోరం ముఖ్యమంత్రి జోరాంతంగా తొలుత మేలోనూ, తిరిగి జూన్‌లోనూ కేంద్రానికి లేఖలు రాశారు. అంతేకాక కేంద్ర హోం శాఖతో చర్చించేందుకు ఓ క్యాబినెట్ మంత్రిని, ఓ సీనియర్ అధికారిని ఢిల్లీకి పంపింది. అయినప్పటికీ కేంద్రం నుండి స్పందన లేదు. వేలాదిగా తరలివచ్చిన శరణార్థుల బాగోగులు చూడడం తమకు తలకుమించిన భారంగా ఉన్నదని జోరాంతంగా ఆ లేఖల్లో కేంద్రానికి తెలియజేశారు. పైగా ఘర్షణలు చోటుచేసుకున్న మయన్మార్, బంగ్లాదేశ్ నుండి కూడా చాలా మంది మిజోరం వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.

కాగా శరణార్థులను ఆదుకునేందుకు ఆర్థిక సాయం చేయలేమని కేంద్ర హోం శాఖ సెప్టెంబరులోనే రాష్ట్రానికి తెలియజేసింది. అయితే ఇతరత్రా సాయం చేస్తానని హామీ ఇచ్చింది. కానీ నేటి వరకూ అది జరగలేదు.

కేంద్రం కనుసన్నల్లో... ఒటిటిలు

- హిందూత్వ అజెండాతోనే కంటెంట్ ఉండాలని బిజెపి సర్కార్ పెత్తనం
- సామాజిక మాధ్యమాల పైనా నియంత్రణ

న్యూఢిల్లీ : చలనచిత్రాలు, వెబ్ సిరీస్‌లను ఒటిటిలో ప్రసారం చేసే అమెజాన్ ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలపై కేంద్ర ప్రభుత్వం, బిజెపి దొడ్డిదారిన పెత్తనం చెలాయిస్తున్నాయి. ఈ సంస్థలు ప్రసారం చేసే భారతీయ కార్యక్రమాలు తమ ఇష్టానుసారమే రూపొందాలని, లేకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బెదిరిస్తున్నాయి. అంతేకాక ప్రజల నుండి కూడా ఒత్తిడి వచ్చేలా పథకాలు రచిస్తున్నాయి. ఇక బిజెపి, దాని అనుబంధ సంస్థలు తమ హిందూత్వ అజెండాను వ్యాప్తి చేసేందుకు సామాజిక మాధ్యమం వాట్సప్‌ను ఉపయోగించుకుంటున్నాయి. మరోవైపు ట్విట్టర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రచారాలను, వినిపించే అసమ్మతి గళాన్ని అణచివేసేందుకు అధికార యంత్రాంగాన్ని ప్రయోగిస్తున్నాయి. తెర వెనుక జరుగుతున్న ఈ తతంగంపై 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక జరిపిన పరిశోధనలో అనేక వాస్తవాలు వెలుగు చూశాయి.

ప్రసారాలపై ఉక్కుపాదం

ఒటిటిలో సినిమాలు, సిరీస్‌లను ప్రదర్శించే సంస్థలపై కేంద్రం స్వీయ నిర్బంధాన్ని విధిస్తోందని వాషింగ్టన్ పోస్ట్ తెలిపింది. మన దేశంలోని నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, వారి న్యాయవాదులపై కమలనాథుల పెత్తనం పెరిగిపోతోంది. బిజెపి లేదా హిందూ సంస్థలకు భిన్నమైన ప్రస్తావనలు చేయరాదని ఆదేశాలు జారీ అవుతున్నాయని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. దేశంలో తమకు ప్రతికూలమైన రాజకీయ, మతపరమైన, కులపరమైన అంశాలను ప్రసారం చేయకుండా నిషేధం విధిస్తున్నారు. ఒకవేళ అలాంటివి ప్రసారమవుతున్నా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. చిత్రీకరణ పూర్తయి ప్రసారానికి సిద్ధంగా ఉన్న సిరీస్‌లను, చిత్రాలను కూడా నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో అనుమతించడం లేదు. ఈ తతంగం అంతా కేంద్రం, బిజెపి పెద్దల కనుసన్నల్లోనే జరుగుతోంది. ఇది 'కనిపించని సెన్సార్‌షిప్' అని సినీ దర్శకుడు అనురాగ్ కశ్యప్ వ్యాఖ్యానించారు.

సిరీస్‌ల ప్రదర్శన విషయంలో ప్రభుత్వం పలు ఆంక్షలు విధిస్తూ నిబంధనలు జారీ చేస్తోంది. ఇక పోలీసుల నుండి హెచ్చరికలు సరేసరి. రాజకీయ నేపథ్యంతో ప్రైమ్ వీడియో నిర్మించిన 'టాండవ్' సిరీస్‌పై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఆ సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని వెంటనే వెళ్లిపోవాలని, పాస్‌పోర్టును అప్పగించాలని పోలీసులు బెదిరించారు. టాండవ్‌కు పట్టిన గతే తమకూ పట్టకుండా నిర్మాణ సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని నెట్‌ఫ్లిక్స్ ఇండియాలో ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన పార్థ్ అరోరా సూచించారు. కంపెనీలు తమ ప్రాజెక్టులను సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వ కర్ర పెత్తనం కారణంగా అనేక ఇతర ప్రాజెక్టులు సైతం అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వ పనితీరుపై వ్యాఖ్యలు చేస్తూ, దేశ రాజకీయాలను సునిశితంగా విమర్శించిన 'గార్మెంట్' అనే సిరీస్ చిత్రీకరణ పూర్తయినా ప్రదర్శనకు నోచుకోలేదు. ముంబయి నగరంపై రాసిన 'మాగ్జిమమ్ సిటీ' అనే నాన్-ఫిక్షన్ పుస్తక ప్రచురణను కూడా నిలిపేశారు.

2021 నుండే ఆంక్షలు మొదలు

ఒటిటి వేదికలపై నియంత్రణ కోసం మోడీ ప్రభుత్వం, బిజెపి2021 ప్రారంభంలోనే ప్రయత్నాలు ప్రారంభించాయి. సినిమాలు, సిరీస్‌లు ప్రసారం చేసే కంపెనీలు స్వీయ నియంత్రణ పాటించేలా కొన్ని మార్గదర్శకాలు విడుదలయ్యాయి. వీటి ప్రకారం వీక్షకుల ఫిర్యాదులను ఆయా కంపెనీలు పక్షం రోజుల్లో పరిష్కరించాల్సి ఉంటుంది. లేకుంటే పరిశ్రమకు సంబంధించిన కమిటీ కానీ లేదా వివిధ మంత్రిత్వ శాఖల సిబ్బందితో కూడిన ప్రభుత్వ కమిటీ కానీ వాటిని వీక్షిస్తాయి. ఒటిటి వేదికలపై ప్రభుత్వం ఈ విధంగా పెత్తనం చెలాయించడానికి ఆయా కంపెనీలు ఆర్జిస్తున్న ఆదాయం కూడా ఓ కారణం. దేశంలో సిరీస్‌లు, చిత్రాలు ప్రదర్శిస్తున్న సంస్థల ఆదాయం గత సంవత్సరం 2.6 బిలియన్ డాలర్లు ఉండగా 2030 నాటికి అది 13 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అందుకే అవి ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకోక తప్పడం లేదు.

2019లో తొలి ఫిర్యాదు

ఒటిటి సంస్థలు ప్రసారం చేస్తున్న సిరీస్‌లపై 2019లో హిందూత్వ వాది రమేష్ సోలంకి తొలిసారిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒటిటిలపై ఎలా ఒత్తిడి చేయాలన్న విషయంపై చర్చించేందుకు తన వంటి హిందూ జాతీయతావాదులతో కూడిన వందలాది వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూపులు సమావేశమయ్యాయని వాషింగ్టన్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. ఈ గ్రూపు సభ్యులు ప్రపంచమంతటా విస్తరించి ఉన్నారని చెప్పారు. సోలంకీ గత సంవత్సరం బిజెపితీర్థం పుచ్చుకున్నారు. తప్పు చేసినా, గీత దాటినా శిక్ష తప్పదన్న విషయాన్ని ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్ అర్థం చేసుకున్నాయని, గుణపాఠం నేర్చుకున్నాయని వివరించారు. 'నీ తలపై తుపాకీ గురి పెట్టి ఉంది. అది ఎప్పుడైనా పేలుతుంది' అని ఓ దర్శకుడు తాజా పరిస్థితిపై వ్యాఖ్యానించారు.

దేశంలోని మీడియాను నియంత్రించేందుకు మోడీ ప్రభుత్వం ఈ ఏడాది వివాదాస్పద 'ప్రసార సర్వీసుల నియంత్రణ' బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

బందీల విడుదలపై త్వరలో ఒప్పందం ?

- తుది దశలో వుందన్న ఖతార్

గాజాలో ఇజ్రాయిల్ సృష్టించిన విధ్వంసం

గాజా : హమాస్ చెరలో వున్న బందీల విడుదల, గాజాలో తాత్కాలిక కాల్పుల విరమణకు సంబంధించి త్వరలోనే ఒక ఒప్పందం కుదిరే అవకాశముందని హమాస్ అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్, అమెరికా, ఖతార్ కలిసి హమాస్‌తో చర్చలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందం కీలకమైన, తుది దశలో వుందని కతార్ పేర్కొంది. మూడు నుండి ఐదు రోజుల పాటు కాల్పులకు తాత్కాలిక విరామం ప్రకటించే అవకాశం వుందని హమాస్ చీఫ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర గాజాలోని అన్ని ఆస్పత్రులు మూతపడ్డాయని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. మరోవైపు దాడులు కొనసాగించడంతో నుస్రత్ శరణార్థుల శిబిరంలో 20మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇప్పటివరకు 13,300మంది చనిపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఉత్తర గాజా తర్వాత ఇప్పుడు దక్షిణ ప్రాంతంపై బాంబు దాడులు జరుపుతున్నారంటే అక్కడ నుండి కూడా ప్రజలను వెళ్లగొట్టాలన్నదే ఇజ్రాయిల్ ఆలోచనగా వుందని ఈజిప్ట్ విమర్శించింది.

పాలస్తీనా శరణార్థుల సంస్థకు భారత్ 25లక్షల డాలర్ల విరాళం

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)కు 25లక్షల డాలర్లను భారత్ విరాళంగా అందజేసింది. ఈ సాయాన్ని ఐరాస సంస్థ స్వాగతించింది. అందులో భాగంగా ఈ నెల 20న 25లక్షలను పాలస్తీనా ప్రతినిధి రేణు యాదవ్‌కు అందచేసినట్లు రమల్లాలోని భారత ప్రతినిధి కార్యాలయం తెలిపింది.

ఇజ్రాయిల్‌తో సహజీవనం కుదరదు

గాజాను దిగ్బంధించి, వేలాదిమంది అమాయకులను బలి తీసుకుంటున్న ఇజ్రాయిల్ దాష్టీకాలను ఉపేక్షించరాదని ఎక్కువ మంది పాలస్తీనియన్లు అభిప్రాయపడ్డారు. ఇజ్రాయిల్‌తో సహజీవనం అసాధ్యమని వెస్ట్ బ్యాంక్, గాజాల్లోని 98శాతం మంది పాలస్తీనియన్లు తేల్చి చెప్పారని రమల్లాకి చెందిన అరబ్ వరల్డ్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. పాలస్తీనియన్లందరినీ లక్ష్యంగా చేసుకున్నారని 65శాతం మంది భావిస్తుంటే, ఇజ్రాయిల్, హమస్ మధ్య యుద్ధంగా కేవలం 18శాతం మందే చూస్తున్నారు. అక్టోబరు 7న హమస్ జరిపిన దాడులను 75శాతం మంది సమర్ధిస్తున్నారు. రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి తమ మద్దతు లేదని 68శాతం మంది తిరస్కరించారు.

లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడి నలుగురు మృతి

దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇద్దరు జర్నలిస్టులతో సహా నలుగురు మరణించారని లెబనాన్ జాతీయ వార్తా సంస్థ తెలిపింది. మీడియా నోరు నొక్కడమన్నదే ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని ఈ దాడి రుజువు చేసిందంటూ లెబనాన్ ప్రధాని నజీబ్ మికటి దాడిని ఖండించారు. ఏదో పొరపాటున జరిగిన దాడి కాదని, కావాలనే లక్ష్యంగా చేసుకుని జర్నలిస్టులను కాల్చి చంపారని అల్ మయదీన్ టివి డైరెక్టర్ వ్యాఖ్యానించారు. చనిపోయిన జర్నలిస్టులు ఇరువురు ఈ టివి చానల్‌లోనే పనిచేస్తున్నారు.

10వ రోజూ సొరంగంలోనే...

(మొదటి పేజీ తరువాయి)

పంపే ప్రణాళిక కూడా తమ వద్ద ఉందని చెప్పారు.

అతిగా స్పందించొద్దు మీడియాను హెచ్చరించిన కేంద్రం

టన్నెల్ ప్రమాద వార్తలను, సహాయక కార్యక్రమాలను రిపోర్టింగ్ చేసేటప్పుడు మీడియా, టెలివిజన్ సంస్థలు జాగ్రత్తగా వ్యవహరించాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంగళవారం సూచించింది. ఈ సమస్యను సంచలనం చేయడం మానుకోవాలని, టన్నెల్ సైట్‌కు సమీపం నుంచి ఎలాంటి లైవ్ పోస్టులు, వీడియోలు నిర్వహించడం మానుకోవాలని మంత్రిత్వ శాఖ కోరింది. 'కార్మికుల విలువైన ప్రాణాలు రక్షించడానికి వివిధ ప్రభుత్వ సంస్థలు అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో జరుగుతున్న ఆపరేషన్ చాలా సున్నితమైన స్వభావం కలిగి ఉంది' అని మంత్రిత్వ శాఖ తెలిపింది.

పుష్కర్ సింగ్ ధామితో సంభాషించిన మోడీ

ఉత్తరకాశీలో జరుగుతున్న సహాయక కార్యక్రమాల గురించి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ప్రధానమంత్రి మోడీ మంగళవారం ఫోన్ ద్వారా సంభాషించారు. కార్యక్రమాల గురించి ఆరా తీసారు. సహాయక కార్యక్రమాలకు అధిక ప్రాధన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఆదేశించారు.

జమిలితో అన్ని పార్టీలకు మేలు : కోవింద్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికలు దేశ ప్రయోజనాలతో ముడిపడిన అంశమని, అన్ని రాజకీయ పార్టీలకు దీనితో ప్రయోజనమేనని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికలపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి రామ్‌నాథ్ కోవింద్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, జమిలి ఎన్నికలపై అన్ని గుర్తింపు పొందిన పార్టీలతోనూ తాను మాట్లాడామని, వారి సలహాలు, సూచనలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఏదో ఒక సమయంలో జమిలి ఎన్నికలను మద్దతు తెలిపాయని అన్నారు. జమిలి ఎన్నికలు దేశ ప్రయోజనాలతో ముడిపడిన అంశమని, ఇందుకు అన్ని పార్టీలు నిర్మాణాత్మకంగా మద్దతు తెలపాలని మాజీ రాష్ట్రపతి కోరారు. జమిలి ఎన్నికలతో డబ్బు ఆదా అవుతుందని, దానిని అభివృద్ధి పనులకు ఉపయోగించడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే విషయాన్ని అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా సిఫారసులు అందజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

కాంగోలో మిలటరీ స్టేడియంలో తొక్కిసలాట

- 37 మంది మృతి

బ్రజవిల్లె : కాంగోలో మిలటరీ స్టేడియంలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో 37 మంది మరణించారు. రిక్రూట్‌మెంట్ కోసం జరుగుతున్న కార్యక్రమానికి యువత ఎక్కువ సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగిందని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమం అర్థరాత్రి వరకు ఎందుకు కొనసాగుతోందో తెలియాల్సి వుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఓకో నిగకాలా చెప్పారు.

వెంటనే దీనిపై దర్యాప్తు చేపట్టనున్నట్లు ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. సైన్యంలో చేరాలనుకునే యువకులు గత వారం రోజులుగా రిక్రూట్‌మెంట్ సెంటర్ల ఎదుట పొడవైన క్యూలు కడుతున్నారు. 1500 ఉద్యోగాలే ఖాళీగా వున్నాయి, కానీ రోజుకు 700మంది చొప్పున రిజిస్టర్ అవుతున్నారు. తొక్కిసలాట నుండి తప్పించుకుని బయటపడిన ఒక యువకుడు మాట్లాడుతూ, మిలటరీ స్టేడియంలో తాను సోమవారం ఉదయం నుండి క్యూలో నిలబడి వున్నానని చెప్పాడు. రిక్రూట్‌మెంట్‌కు ఇది చివరి రోజు. అందువల్లే అర్థరాత్ర అయినా వేచి వుండాలని తమలో చాలామంది నిర్ణయించుకున్నామని ఆ వ్యక్తి మీడియాకు తెలిపారు. సుదీర్ఘ సమయం వేచి వుండడంతో చాలామందిలో అసహనం పెరిగిపోయిందని, దాంతో బలవంతంగా నెట్టుకునైనా ముందుకు వెళ్లాలని ప్రయత్నించారని, ఫలితంగా తొక్కిసలాట జరిగిందని, పెద్ద సంఖ్యలో ప్రజలు మరణించారని, పలువురు గాయపడ్డారని ఆ వ్యక్తి తెలిపారు.

స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత

- థాయిలాండ్ కేబినెట్ ఆమోదం

బ్యాంకాక్ : స్వలింగ సంపర్కుల వివాహాలను అనుమతిస్తూ పౌర, వాణిజ్య నిబంధనావళికి చేసిన సవరణను థాయిలాండ్ మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. వచ్చే నెల్లో ఈ ముసాయిదాను పార్లమెంట్‌కు అందచేయనున్నారు. సాధారణ జంటలు పొందుతున్న హక్కులనే స్వలింగ దంపతులు కూడా పొందేందుకు వీలుగా 'స్త్రీ, పురుషులు, భార్యా, భర్తలు అనే పదాలను వ్యక్తులు, వివాహ భాగస్వాములుగా ప్రస్తావిస్తూ సివిల్, కమర్షియల్ కోడ్‌కు సవరణ చేసినట్లు ప్రభుత్వ డిప్యూటీ ప్రతినిధి కరోమ్ వెల్లడించారు. స్వలింగ జాతుల వారైనప్పటికీ ఒక బంధాన్ని కొనసాగిస్తూ కుటుంబానిన ఏర్పాటు చేసే హక్కుకు ఈ చట్టం హామీ కల్పిస్తుందన్నారు. అలాగే స్వలింగ దంపతులను గుర్తిస్తూ వారికి పెన్షన్ ఫండ్ చట్ట సవరణను కూడా తేనున్నట్లు చెప్పారు. డిసెంబరు 12న ఈ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని శ్రేష్ఠ థావిసిన్ విలేకర్లకు తెలిపారు. పార్లమెంట్ ఆమోద ముద్ర, రాజు ధృవీకరణ పొందిన తర్వాత ఆసియాలో స్వలింగ సంపర్కుల వివాహాలను అనుమతించిన దేశంగా ఆసియాలో మూడవది కానుంది. ఇప్పటికే తైవాన్, నేపాల్‌లో ఈ వివాహాలను అనుమతిస్తున్నారు.

బంగారు గని కూలి 10 మంది మృతి

పరమరిబో : దక్షిణ అమెరికా దేశమైన సూరినామ్‌లో అక్రమ బంగారు గని సోమవారం కూలిపోవడంతో 10 మంది మరణించారని అధికారులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే గ్రామీణ దక్షిణ ప్రాంతంలో గల గని వద్దకు పోలీసులు, మిలటరీ అధికారులు, సహాయక సిబ్బంది చేరుకున్నారు. బంగారం కోసం తవ్వకాలు జరిపేందుకు గని కార్మికులు తమ స్వంతంగా సొరంగాలు నిర్మించుకుంటున్నట్లు తెలుస్తోందని అధికారులు చెప్పారు. సూరినామ్‌లో ఈ పరిస్థితి సర్వ సాధారణంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇక్కడ నెలకొన్న పరిస్థితులను అదుపులోకి తీసుకురావడం చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వ బడ్జెట్ సమావేశంలో ప్రసంగిస్తుండగా, ఈ విషయం తెలియడంతో వెంటనే ఇక్కడకు రావాల్సి వచ్చిందని చాన్ శంతోఖి చెప్పారు. సూరినామ్‌లో బంగారు గనులు చాలా ఎక్కువ. ఇటువంటి గని తవ్వకాల్లో అమెరికా, కెనడా కంపెనీలకు భారీగా పెట్టుబడులు పెడుతూ వుంటాయి.

మీ కోసం

బాగా మంటగా ఉన్న పచ్చి మిరపకాయలను ఫ్రిజ్ నుంచి తీసి చల్లటి నీటిలో కాసేపు ఉంచితే కారం తగ్గుతుంది.

జీవన సౌరభం

ప్రవర్తన అద్దం లాంటిది. ప్రతి వ్యక్తి ప్రతిబింబం దానిలో కనిపిస్తుంది.

JEEVANA జీవన the family

అన్నదమ్ములు

అనగనగా అవుసలపల్లి అనే గ్రామంలో కృష్ణ, సాయి అనే అన్నదమ్ములు ఉన్నారు. ఇద్దరూ కలిసి మెలిసి ఉండేవారు. పాఠశాలలో, గ్రామంలో అందరినీ పలకరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. అక్కచెల్లెళ్లు లేకపోవడంతో చాలామందిని సొంత అక్క, చెల్లెలుగా పిలుచుకునేవారు.

ఒకసారి వారిద్దరూ చిన్న విషయానికి గొడవ పడ్డారు. మాట్లాడుకోవడం మానేసారు. ఆ రోజు వేరువేరుగా బడికి వెళ్లారు. ఊరందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, కలివిడిగా ఉండే వాళ్లు ఒక్కసారిగా మారిపోయేసరికి ఊరంతా ఆశ్చర్యపోయింది. వారిద్దరూ విడివిడిగా ఊరివారిని పలకరించడం చూసి, ఎవరూ వారికి సమాధానం ఇవ్వటం లేదు. ఆరోజు ఇంటికి వెళ్లాక కృష్ణ, సాయికి ఏదో దిగులుగా ఉంది. రాత్రి నిద్రపట్టలేదు. ఊరందరూ ఎందుకు మాట్లాడడం లేదో తెలియక దిగాలు పడ్డారు. తామిద్దరం కలసి పలకరిస్తే పలికిన వాళ్లు, విడివిడిగా పలకరిస్తే సమాధానం చెప్పకపోవడం వెనుక ఆంతర్యం తెలుసుకున్నారు. మరుసటి రోజు ఉదయం ఇద్దరూ కలిసి బడికి వెళ్లారు. వెళుతూ వెళుతూ ఎదురైనా ప్రతి ఒక్కరినీ పలకరిస్తుంటే ఊళ్లో వాళ్లు కూడా చక్కగా మాట్లాడారు. అప్పుడు వారిద్దరూ తమ తప్పు తెలుసుకొని ఇంకెప్పుడు గొడవలు పడకుండా కలిసిమెలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. వారిని చూసి గ్రామంలోని అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు కూడా కలిసి ఉండడం అలవాటు చేసుకున్నారు.

– బత్తుల భానుతేజ, 10వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, హవేలీ ఘనపూర్,
మెదక్ జిల్లా, 93919 92070.

జత చేయండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్లను రెండు భాగాలుగా ఇచ్చాం. ఇచ్చిన క్లూ ఆధారంగా ఆ భాగాలను జత చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

చీర్ణపల్లి నవిత,
ఏడవ తరగతి,
జక్కాపూర్,
సిద్ధిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ అవార్డు నా దేశానికి అంకితం!

'నేను ఏ భారతదేశం నుండి వచ్చానంటే.. అక్కడ రెండు భారతదేశాలు ఉన్నాయి' అంటూ రెండేళ్ల క్రితం దేశ వాస్తవ పరిస్థితులను, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను, రాజకీయ నాయకుల తీరుతెన్నులను, రైతులపై చేస్తున్న అన్యాయాలను ప్రతి ఒక్క అంశాన్ని ఓ ఆరు నిమిషాల వీడియోలో కుండబద్దలు కొట్టి చెప్పిన నోయిడాకు చెందిన స్టాండప్ కమెడియన్ వీర్ దాస్ అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆ వ్యాఖ్యలు చేసినందుకు అతనిపై భారత్ పాలకులు నిప్పులు చెరిగారు. 'దేశద్రోహి' అన్నారు. 'తీవ్రవాది' అని నిందించారు. ఇంకా, కామెడీ షోలు చేసుకుని ఆదాయం సంపాదించే అతనిపై నిషేధాజ్ఞలు జారీచేశారు. ముందుగా నిర్ధారణ చేసుకున్న షోలను నిర్వాహకులతో బలవంతంగా రద్దు చేయించారు. అడుగడుగునా అతన్ని నిలువరించారు. ఆర్థికంగా కుంగదీశారు. ఈ రెండేళ్లలో అతను ఎంత క్షోభ అనుభవించాడో.. సరైన ఆదాయం లేక ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపాడో.. అనుభవించిన అతడికి మాత్రమే తెలుసు. నటీనటులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే అంతర్జాతీయ ఎమ్మీ అవార్డు ఈ ఏడాది అతన్ని వరించింది. అవార్డు తీసుకుంటూ దాస్ గత స్మృతులను నెమరువేసుకున్నాడు. ఈ సందర్భంగా మన 'దేశ భక్త' పాలకులకు అంతలా మింగుడుపడని వీర్ దాస్ వ్యాఖ్యలను ఒకసారి పునరావలోకనం చేసుకుందాం.

2021 నవంబరు 20, అమెరికా వాషింగ్టన్ డీసీలోని జాన్ ఎఫ్ కెన్నడీ స్టేడియం. స్టాండప్ కామెడీ షో నిర్వహించేందుకు సిద్ధమైన ఆ స్టేడియం ఆరోజు ప్రేక్షకులతో కిక్కిరిసిపోయి వుంది. అప్పుడే 42 ఏళ్ల వీర్‌దాస్ స్టేజీ మీద ఉన్న మైక్ దగ్గరకు చేరుకున్నాడు. అతన్ని చూడగానే అభిమానులంతా హర్షధ్వానాలు చేశారు. వారందరినీ పలకరించిన అతడు తన వెంట తెచ్చుకున్న కాగితంలో ఓ కవితను చదవడం ప్రారంభించాడు.

'ఇక్కడ నన్ను మీరంతా భారతదేశం నుండి వచ్చానని గుర్తిస్తారు. అయితే నేను ఏ భారతదేశం నుండి వచ్చానంటే, అక్కడ రెండు భారతదేశాలు ఉన్నాయి.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ మాస్కులు ధరించిన చిన్నారులు ఒకరి చేతులు ఒకరు పట్టుకుంటారు. అలాగే ముసుగులు ధరించకుండా ఆలింగనాలు చేసుకునే రాజకీయ నాయకులూ ఉంటారు. కోవిడ్ సమయంలో కరోనా మార్గదర్శకాలు పాటించమని దేశప్రజలకు సూచించిన పాలకులు వాటిని తుంగలో తొక్కిన విధానాన్ని ఈ వ్యాఖ్యల్లో ఎండగట్టారు. ఇంకా..

నేను భారత దేశం నుండి వచ్చాను. అక్కడ లైంగికతను అపహాస్యం చేస్తారు. కానీ కోట్లాదిమంది నాలుకలపై అసభ్య పదజాలాలు అలవోకగా నాట్యమాడుతాయి.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ జర్నలిజం చనిపోయింది. ఫ్యాన్సీ స్టూడియోస్‌లో ఫ్యాన్సీ సూట్‌లు వేసుకున్న పురుషులు తమకు ఇష్టమైన వ్యక్తుల కోసం పనిచేస్తారు. ల్యాప్‌ట్యాప్‌లు పట్టుకున్న మహిళలు వీధుల్లో నిజాలు చెప్పేందుకు శ్రమపడుతుంటారు.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ గాలి స్వచ్ఛత 9000 ఎక్యూఐ ఉంటుంది. అయితే మేము ఇప్పటికీ ఇంటి పైకప్పులపై పడుకుని రాత్రిపూట నక్షత్రాలను చూస్తాం.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ మేము పగటిపూట స్త్రీలను పూజిస్తాం. రాత్రుళ్లు సామూహిక అత్యాచారాలకు పాల్పడతాం. నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ పాత నాయకులు తమ చనిపోయిన తండ్రుల గురించి మాట్లాడటం మానరు. కొత్త నాయకులు తమ జీవించి ఉన్న తల్లుల మార్గాన్ని అనుసరించడం ఎప్పటికీ ఆపరు. నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ 30 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నవారు అత్యధికం. కానీ వారు ఇప్పటికీ 75 ఏళ్ల నాయకుల నుండి 150 ఏళ్ల ఆలోచనలను వినడం ఆపలేదు.



నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ క్లబ్‌ల బయట వీధుల్లో నిద్రిస్తారు. అలాగే ఏడాదికి 20 సార్లు వీధుల్లో క్లబ్‌లు నిర్వహిస్తారు.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ మేము శాకాహారులుగా ఉన్నందుకు గర్విస్తాం. అయితే ఆ కూరగాయలు పండించే రైతన్నలను చితకబాదుతాం.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ ఎప్పుడూ నోరు మూసుకోని భారతదేశం కనపడుతుంది. అలాగే ఎప్పుడూ మాట్లాడని దేశం కూడా ఉంటుంది.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ మేం బాలీవుడ్ కారణంగా ట్విట్టర్‌లో విడిపోయాం. కానీ అదే బాలీవుడ్ కారణంగా థియేటర్ చీకటిలో కలిసిపోయాం.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ మా సంగీతం చాలా కష్టంగా ఉంటుంది. కానీ మా భావోద్వేగాలు చాలా మృదువైనవి.

నేను భారతదేశం నుండి వచ్చాను. అక్కడ మాకు ప్రధాని రక్షణ గురించిన సమాచారం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. కానీ ఆ ప్రధాని ప్రజల కోసం తలపెట్టే విధానాల సమాచారం అందించే పిఎంకేర్ వివరాల పొందలేం.

నేను భారతదేశం నుండి వచ్చాను. వందల ఏళ్లు పాలించిన బ్రిటీష్‌వాళ్లను తరిమికొట్టి స్వతంత్ర పాలనలోకి వచ్చిన భారతదేశం మాది. అక్కడ చీరలు, షూలు ధరించిన మహిళలు ఉంటారు. కానీ వారంతా జీవితంలో ఎప్పుడూ చీరలు, షూ వేసుకోని ముసలివాళ్ల మాటలు వినడానికి ఇష్టపడతారు' అంటూ దేశ తీరుతెన్నులను తన కవితలో వినిపించారు దాస్.

ఆ ప్రయాణం ముగించుకుని అతను భారత్‌కి ఇంకా తిరిగి రాకముందే ఆయనపై విద్వేషమూకలు విరుచుకుపడ్డాయి. రోడ్లమీదకి వచ్చి అతని దిష్టిబొమ్మలను తగలబెట్టారు. దేశం పరువు తీశాడంటూ పాలకులు, పెద్దలు, వంతపాడే మీడియా నోరేసుకుని పడిపోయింది. అంతటితో ఆగక అతని కామెడీషోలను రద్దు చేయించారు. కఠిన ఆంక్షలు జారీచేశారు. పోలీసు కేసులు నమోదుచేశారు. అందుకే ఈ అవార్డు తీసుకునే కొన్ని గంటల ముందు..

'ఈ విశ్వం సంపూర్ణ వృత్తం. దీనికి నేను కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఎవరైనా చీకటిలో ఉంటే సూర్యకాంతి వచ్చేవరకు ఉండండి. అధైర్యపడవద్దు. నిరుత్సాహం వద్దు. ప్రేమ ఎక్కడ ఉంటే అక్కడికి ఈ విశ్వం మిమ్మల్ని తీసుకుపోతుందని నమ్మండి. నేను భారతీయుడిని. నా అణువణువు భారతదేశ పౌరునిగా గర్విస్తుంది. అంతమాత్రాన మీ ఆలోచనలతో నేను ఏకీభవించాల్సిన అవసరం లేదు. ఇక్కడ అనేక విధానాలున్నాయి. వాటిలో నేను ఎంచుకున్న మార్గం నాకు భారతీయునిగా గుర్తింపునిస్తుంది' అంటూ తన స్టాండప్ కమెడియన్ ప్రయాణాన్ని, 'టు ఇండియాస్' వీడియో చేసినందుకు తనపై జరిగిన దౌర్జన్యాన్ని, ఈ రెండేళ్లలో తను పడిన వేదనను సోషల్‌మీడియాలో పంచుకున్నారు. అవార్డు తీసుకుంటూ 'ఇది నా దేశం భారత్‌కి అంకితమ'ని వ్యాఖ్యానించారు. ఈ అవార్డు అందుకున్న తొలి ఇండియన్ కమెడియన్‌గా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోనుంది.

నేషనల్ హెరాల్డ్ కేసులో

రూ.750 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ పత్రికపై మనీ లాండరింగ్ దర్యాప్తులో భాగంగా అసోసియేటెడ్ జర్నల్స్‌కు చెందిన రూ.751.9 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మంగళవారం అటాచ్ చేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్త, అసోసియేటెడ్ జర్నలిస్ట్‌పై మనీలాండరింగ్ నిరోధక కేసు కింద తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇడి తెలిపింది. 2013లో బిజెపి నేత సుబ్రమణ్య స్వామి ఢిల్లీ కోర్టులో వేసిన ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. వార్తాపత్రికను స్వాధీనం చేసుకోవడంలో గాంధీల తరపున నిధులు దుర్వినియోగం జరిగాయన్నది ఫిర్యాదీదారుని వాదన. ఈ కేసులో 2015 డిసెంబరులో సోనియా, రాహుల్‌లకు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఇసిఐ ఆదేశాలను పాటించని అధికారులు

- ప్రత్యేక పరిశీలకులను నియమించండి
- గ్రామ సచివాలయ సిబ్బందిని బిఎల్‌ఒగా తొలగించాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ సంబంధించి అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల రాజకీయ ఒత్తిళ్లతో తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయడంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను డిఇఒలు, ఇఆర్‌ఒలు పాటించడం లేదని టిడిపి ఫిర్యాదు చేసింది. మంగళవారం నాడిక్కడ కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను టిడిపి నేతలు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, పయ్యావుల కేశవ్, బొండా ఉమా, నిమ్మల రామానాయుడు, కనకమేడల రవీంద్రకుమార్ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో తప్పులను వివరించారు. ప్రత్యేక పరిశీలకులను నియమించాలని కోరారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ సిబ్బందిని బిఎల్‌ఒగా తొలగించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఎజి పొన్నవోలు సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలు కోర్టు ధిక్కారమేనని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. పొన్నవోలుపై న్యాయపరమైన చర్యలు చేపట్టాలన్నారు. 'పొన్నవోలు న్యాయమూర్తికి దురుద్దేశాలు అంటగట్టారు. తీర్పు వారికి అనుకూలంగా వస్తేనేమో న్యాయం గెలిచిందంటారు. తీర్పు వ్యతిరేకంగా వస్తే వ్యవస్థలను భయపెట్టే విధంగా మీడియా సమావేశాలు పెడుతున్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుంటున్న ఎజి ఏదైనా ఉంటే కోర్టులో వాదించాలి. అంతే కానీ, మీడియా ముందు కాదు. అలా చేయదల్చుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేసి.. వైసిపిలో చేరాలి. అప్పుడు మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుకోవచ్చు. ప్రభుత్వ న్యాయవాది హోదాలో ఉండి ఇలా మాట్లాడటం.. న్యాయ వ్యవస్థలను ధిక్కరించడమే అవుతుంది. న్యాయమూర్తులను పరోక్షంగా భయభ్రాంతులకు గురిచేసేలా చేయడమే. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.. చర్యలు తీసుకోవాలని కోరుతాం' అని ఎంపి కనకమేడల అన్నారు.

ప్రపంచ బిలియర్డ్స్ ఛాంప్ పంకజ్

ఫైనల్లో సౌరభ్ కొఠారిపై గెలుపు

రికార్డుస్థాయిలో 26వ సారి టైటిల్ కైవసం

కౌలాలంపూర్: అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వరల్డ్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను భారత్‌కు చెందిన పంకజ్ అద్వాని చేజిక్కించుకున్నాడు. మంగళవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పంకజ్.. 2018 ప్రపంచ ఛాంపియన్, భారత్‌కే చెందిన సౌరభ్ కొఠారిని చిత్తుచేశాడు. తొలి గంటలో 26-180పాయింట్లతో వెనుకబడ్డ పంకజ్.. ఆ తర్వాత వరుసగా పాయింట్లు సాధించాడు. దీంతో పంకజ్ 1000-416పాయింట్ల తేడాతో సౌరభ్ కొఠారిపై గెలిచాడు. పంకజ్ వరుసగా 250 పాయింట్లు సాధించి పైచెయ్యి సాధించినా.. ఆ తర్వాత కొఠారి పుంజుకొని 99పాయింట్లతో రాణించాడు.

ఈ క్రమంలో పంకజ్ 259, 176పాయింట్లు సాధించి 900పాయింట్ల మార్క్‌కు చేరుకున్నాడు. 2003 లో తొలిసారి పంకజ్ ప్రపంచ బిలియర్డ్ టైటిల్ నెగ్గిన పంకజ్.. తొమ్మిదిసార్లు 'లాంగ్ ఫార్మాట్' టైటిల్‌ను, ఒకసారి ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలువగా.. 8సార్లు 'పాయింట్ ఫార్మాట్' ఛాంపియన్‌గా నిలిచాడు. దీంతో 26 సార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచిన పంకజ్ అద్వానీ నయా చరిత్ర సృష్టించాడు. ఇటీవల దోహాలో ముగిసిన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లోనూ పంకజ్.. 900-273 తేడాతో భారత్‌కే చెందిన రూపేష్ షాను ఓడించాడు. 14ఏళ్లకే బిలియర్డ్స్‌లో అరంగేట్రం చేసిన పంకజ్.. రికార్డు స్థాయి విజయాలతో సత్తా చాటుతున్నాడు.

ప్రాక్టీస్ చేస్తున్న భారత్ క్రికెటర్లు

నెట్ ప్రాక్టీస్‌లో భారత్, ఆసీస్ క్రికెటర్లు

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

ఈ నెల 23న విశాఖలో జరిగే టి - 20 మ్యాచ్‌లో పాల్గొనేందుకు వచ్చిన భారత్, ఆసీస్ క్రికెటర్లు మంగళవారం సాయంత్రం నెట్ ప్రాక్టీస్ చేశారు. వారంతా రుషికొండ సమీపంలో ఉన్న రాడిసన్ బ్లూలో ఆతిథ్యం పొందుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం పిఎం.పాలెం క్రికెట్ స్టేడియానికి చేరుకుని బి - గ్రౌండ్‌లో ముమ్మర సాధన చేశారు. ఇదిలా ఉండగా మ్యాచ్ ఏర్పాట్లపై విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, సిపి. రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి స్టేడియంలో ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు సమన్వయంతో మెలిగి ఎలాంటి లోటుపాట్లూ లేకుండా చూడాలని ఆదేశించారు.

దేవరలో సంజయ్‌దత్?

ఎన్టీఆర్- కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' రూపుదిద్దుకుంటోంది. ఇందులో ఓ కీలకమైన పాత్ర కోసం బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్‌ను సంప్రదించారని సమాచారం. ఈ చిత్రంలో ఇప్పటికే సైఫ్ అలీఖాన్ విలన్‌గా ఎంపికయ్యారు. మరి సంజయ్ ఎలాంటి పాత్రలో కనిపిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. 'దేవర'ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. పార్ట్ 1 వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది. ఇప్పటికే దక్షిణాది చిత్రాలైన 'కేజీఎఫ్', 'లియో' చిత్రాల్లో సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించిన విషయం తెలిసిందే!



కొత్తదనంతో 'ఆదికేశవ': వైష్ణవ్ తేజ్

ఆదికేశవ సినిమా మాస్‌గా కొత్తదనంతో ఉంటుందని హీరో వైష్ణవ్ తేజ్ చెప్పారు. వైష్ణవ్‌తేజ్, శ్రీలీల జంటగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'ఆదికేశవ' ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ సినిమాతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జోజు జార్జ్, అపర్ణా దాస్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ఈనెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వైష్ణవ్ తేజ్ చిత్ర విశేషాలను పాత్రికేయులతో పంచుకున్నారు. 'రంగ రంగ వైభవంగా' చిత్రీకరణ చివరి దశలో ఉన్నప్పుడు నిర్మాత నాగవంశీ ఈ కథ వినమని చెప్పారు. వినగానే నాకు ఎంతగానో నచ్చింది. ఆ తర్వాత ఇంకా ఎన్నో మెరుగులు దిద్దుకుని అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులు సినిమా చూసి థియేటర్ల నుంచి ఆనందంగా బయటకు వస్తారు' అని వివరించారు.

త్రిషకు చిరంజీవి మద్దతు

'త్రిషపై నటుడు మన్సూర్ అలీఖాన్ చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి వచ్చాయి. ఒక నటిని మాత్రమే కాదు. ఏ స్త్రీని ఇలా అనకూడదు. చాలా అసహ్యంగా ఉన్నాయి. వీటిని తీవ్రంగా ఖండించాలి. త్రిషకు మాత్రమే కాదు.. ఇలాంటి వ్యాఖ్యలు ఏ అమ్మాయి ఎదుర్కొన్నా.. నేను అండగా ఉంటాను' అని హీరో చిరంజీవి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అలీఖాన్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. వాటిని ఖండిస్తూ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పోస్టులు పెడుతున్నారు. లోకేశ్ కనగరాజ్, నటి రోజా, రాధిక, గాయని చిన్మయి.. ఇలా టాలీవుడ్, కోలీవుడ్‌లకు చెందిన ప్రముఖులు ఈ వ్యాఖ్యలను విమర్శిస్తున్నారు. తాజాగా త్రిషకు మద్దతుగా చిరంజీవి పోస్ట్ పెట్టారు. అలీఖాన్ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. సుమోటోగా స్వీకరించిన ఎన్‌సీడబ్ల్యూ.. మన్సూర్‌పై కేసు నమోదు చేయాలని తమిళనాడు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

ఛెత్రీసేనకు నిరాశ..

ఖతార్ చేతిలో 3-0తో భారత్ ఓటమి
ఫిఫా ప్రపంచకప్-2026 క్వాలిఫయర్స్

భువనేశ్వర్: ఫిఫా ప్రపంచకప్ 2026 క్వాలిఫయర్స్‌లో భారత్‌కు రెండోమ్యాచ్‌లో నిరాశ తప్పలేదు. కళింగ స్టేడియంలో మంగళవారం ఖతార్‌తో జరిగిన పోటీలో భారత్ 0-2 గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. తొలి మ్యాచ్‌లో కువైట్‌పై గెలిచినా.. నేడు జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఖతార్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్ధభాగం ప్రారంభంలోనే కతార్ మరో గోల్ చేసి 2-0 ఆధిక్యతలో సంపాదించింది. మ్యాచ్ ముగియడానికి కొద్ది నిమిషాల ముందు (86వ ని.) ఖతార్ మరో గోల్ కొట్టడంతో ఆ జట్టు 3-0 గోల్స్ తేడాతో భారత్‌ను చిత్తుచేసింది. ఖతార్ తరపున మోస్తాఫా(4వ ని.), అజ్మోజ్(47వ ని.), యూసుఫ్(86వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. దీంతో గ్రూప్-ఏలో భారత్ 3పాయింట్లతో మూడోస్థానంలో కొనసాగుతోంది.

ప్రణయ్ శుభారంభం

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

హాంగ్జౌ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు హెచ్.ఎస్ ప్రణయ్ రాయ్‌తోపాటు పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీలు శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్ పోటీలో ప్రణయ్ 21-18, 22-20పాయింట్ల తేడాతో చైనీస్ తైపీకి చెందిన ఛౌ-టిన్-చెన్‌పై వరుససెట్లలో గెలిచాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 21-12, 21-10పాయింట్ల తేడాతో ఇంగ్లండ్‌కు చెందిన బెన్ లానే-సీన్ వెండేపై కేవలం 37 నిమిషాల్లోనే విజయం సాధించారు. ఇక మహిళల సింగిల్స్‌లో ఆకర్షీ కశ్యప్ తొలిరౌండ్‌నే ఓటమిపాలైంది. ఆకర్షీ కశ్యప్ 12-21, 14-21తో జంగ్-హి-మన్(చైనా) చేతిలో వరుససెట్లలో పరాజయాన్ని చవిచూసింది.

ఐసిసి అండర్-19 ప్రపంచకప్ టోర్నీ

వేదిక మార్పు



దుబాయ్: ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ టోర్నీ వేదిక మారింది. ఈ మేరకు ఐసిసి మంగళవారం ఓ ప్రకటనలో దక్షిణాఫ్రికాలో ఈ టోర్నమెంట్ జరగనున్నట్లు వెల్లడించింది. వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశపరచడంతో ఆ దేశ క్రికెట్‌బోర్డు క్రీడల మంత్రి రద్దు చేయడం తెలిసిందే. దాంతో, క్రికెట్ బోర్డులో రాజకీయ, ప్రభుత్వ జోక్యం తమ నిబంధనలకు విరుద్ధమంటూ ఐసిసి శ్రీలంక క్రికెట్ బోర్డును సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో, శ్రీలంకలో జరగాల్సిన అండర్-19 వరల్డ్ కప్ వేదిక మారింది. పురుషుల విభాగంలో 15వ అండర్-19 వరల్డ్ కప్ వచ్చే ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతుందని తెలిపింది. మంగళవారం ఐసిసి బోర్డు సమావేశంలో అండర్-19 వేదిక మార్పు సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. క్రికెట్ బోర్డుపై సస్పెన్షన్ ఉన్నప్పటికీ... శ్రీలంక జట్టు అంతర్జాతీయ క్రికెట్లో ద్వైపాక్షిక సిరీస్ లతో పాటు, ఐసిసి టోర్నీల్లో పాల్గొనవచ్చని వెల్లడించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68